గ్రామ సంక్షేమ సహాయకులకు-న్యాయ మార్గదర్శి

# మన చట్టాలు,
# మన హక్కులు

డా॥ పల్లా త్రినాథరావు

గిరిజన సంక్షేమ శాఖ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ

గ్రామ సంక్షేమ సహాయకులకు – న్యాయ మార్గదర్శి

# మన చట్టాలు, మన హక్కులు


మొదటి ముద్రణ : 2019

ప్రతులు : 2000



డా॥ పల్లా త్రినాథరావు

రచయిత



ప్రచురణ :

గిరిజన సంక్షేమ శాఖ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ

గ్రామ సంక్షేమ సహాయకులకు - న్యాయ మార్గదర్శి

# మన చట్టాలు, మన హక్కులు ....

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | v |
| 1) | షెడ్యూల్డు ప్రాంత చట్టాలు–గిరిజన హక్కులు–పరిచయం | 1 |
| 2) | ఏజెన్సీ ప్రాంత న్యాయ పాలన–సివిల్ కోర్టులు | 4 |
| 3) | షెడ్యూల్డు ప్రాంత పాలన–ప్రత్యేక రాజ్యాంగ హక్కులు | 11 |
| 4) | సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ–అభివృద్ధి విధానాలు | 17 |
| 5) | షెడ్యూల్డు ప్రాంత భూమి నిబంధనలు | 22 |
| 6) | అటవీ హక్కుల గుర్తింపు చట్టం | 29 |
| 7) | షెడ్యూల్డు ప్రాంత స్థానిక సంస్థలు–**"పెసా చట్టం"** | 414 |
| 8) | ఎస్.సి. మరియు ఎస్.టి. ఉప ప్రణాళిక చట్టం | 51 |
| 9) | కుల ధృవీకరణ పత్ర జారీ చట్టం | 54 |
| 10) | షెడ్యూల్డు ప్రాంత ఋణ (వడ్డీ) వ్యాపార నిబంధనలు 1960 | 58 |
| 11) | షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచార నిరోధక) చట్టం | 60 |
| | **అనుబంధం–1** | |
| | 1) ఆంధ్రప్రదేశ్ ఎస్.టి.ల జాబితా | 70 |
| | **అనుబంధం–2** | |
| | 1) ఐక్యరాజ్య సమితి ఆదివాసీ హక్కుల ప్రకటన | 72 |

**P. Ranjit Basha,** I.A.S.
Director of Tribal Welfare

Office of the
Director of Tribal Welfare
Government of Andhra
Pradesh

Dt. 16.09.2019

# ముందుమాట

ప్రజలకు పరిపాలన మరింత చేరువ చేసేందుకు వీలుగా గ్రామ  సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట పరుస్తున్నది. అందులో భాగంగా సచివాలయ వాలంటీర్స్, సంక్షేమ సహాయకుల మరియు ఇతర సిబ్బంది నియామకాలను ప్రభుత్వం చేపట్టింది.  పరిపాలన సజావుగా సాగాలంటే ముఖ్యంగా మానవ వనరుల అభివృద్ధి కీలకం. గిరిజన హక్కుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు రూపకల్పన చేసింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసించే గిరిజనులకు ప్రత్యేక చట్టాలు రూపొందించబడ్డాయి. వాటిలో గిరిజన భూమి హక్కుల కోసం రూపొందించిన  ప్రత్యేక భూమి నిబంధనలు, స్థానిక సంస్థల పరిపాలన కోసం "పెసా" చట్టం ముఖ్యమైనవి. అలాగే అటవీ హక్కులను  ఉద్దేశించి అటవీ హక్కుల గుర్తింపు చట్టం మరియు గిరిజన అభివృద్ధి మరియు సంక్షేమం కోసం ఎస్.సి మరియు ఎస్.టి ఉప ప్రణాళిక చట్టాలు మరియు షెడ్యూల్డు ప్రాంత వడ్డీ వ్యాపార నిబంధనలు మరియు తదితర చట్టాలు, ప్రభుత్వాలు రూపొందించాయి. క్షేత్ర స్థాయిలో పనిచేసే వివిధ శాఖల, ప్రభుత్వ సిబ్బందికి చట్టాల పట్ల అవగాహన అవసరం. అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే అధికారులకు చట్టాల లక్ష్యాలు తెలిస్తేనే వాటిని సమర్ధవంతముగా అమలు చేయగలరు.

చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు **డా. పల్లా త్రినాధ రావు** వ్రాసిన **"మన చట్టాలు - మన హక్కులు"** పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులకు మరియు క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ కాలంలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ  కార్యాలయం చేస్తున్న కృషి అభినందనీయం.

(పి.రంజిత్ బాషా)

D.No. 40-3/1-46/4A, Konerulakshmaiah Street, Moghalrajpuram, VIJAYAWADA - 520 010
Phone : 0866-2494332, Fax : 0866-2494331 E-mail : apctwd@gmail.com www.aptribes.gov.in

# 1. షెడ్యూల్డు ప్రాంత చట్టాలు - గిరిజన హక్కులు - పరిచయం

అనేక వేల సంవత్సరాల నుండి అడవులనే నివాసంగా ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్న వారిని సాదారణంగా గిరిజనులు లేదా ఆదివాసులు అంటారు. అయితే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి ప్రకటించిన జాతులను షెడ్యూల్డు ట్రైబ్ (ఎస్.టి)గా పరిగణిస్తారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలా ప్రకటించబడిన గిరిజన తెగలు 34 వున్నాయి.

వీరికి ప్రత్యేక సంస్కృతి, భాషలు, సాంప్రదాయాలు వుంటాయి. వీరి జీవన విధానము, జీవనాధారము అటవీ ప్రాంతాల్లోని భూసంపద, వృక్ష సంపద, నీటి వనరులపై ఆధారపడి ఉంటుంది. ఇతరవర్గ ప్రజలతో పోలిస్తే అనేక రంగాలలో వెనుకబడి వున్న కారణంగా ప్రభుత్వము వీరికి కొన్ని ప్రత్యేక రాజ్యాంగ సదుపాయములు కల్పించినది.

### మీకు తెలుసా?

**భారత రాజ్యాంగం 342(1) కింద ఎస్.టి.లుగా రాష్ట్రపతి ప్రకటిస్తారు. అలా ప్రకటించిన ఎస్.టి.లకు విద్య, రాజకీయ మరియు ఇతర రాజ్యాంగ ప్రయోజనాలు ప్రత్యేకంగా వుంటాయి.**



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం ఎస్.టి.లు సంఖ్య 27.39 లక్షలు, మొత్తం రాష్ట్ర జనాభాలో వీరు 5.53 శాతం**

**గిరిజన తెగలలో మరింత వెనుకబడిన తెగలను ప్రత్యేక సమస్యాత్మక గిరిజన తెగలు (పి.వి.టి.జి)గా గుర్తించారు. మన రాష్ట్రంలో కొండరెడ్డి, సవర, పోర్జ, గదబ, చెంచు, కొందు తెగలను గుర్తించారు.**

గిరిజనులు అధికంగా నివసిస్తూ, అభివృద్ధికి నోచుకోని మరియు ఆర్థిక స్థాయిలో అంతరాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి రాష్ట్రపతికి ఆమోదం కోసం ప్రభుత్వం పంపుతుంది. అలా గుర్తించిన ప్రాంతాలను రాష్ట్రపతి ప్రకటిస్తే వాటిని షెడ్యూల్డు ప్రాంతాలుగా పిలుస్తారు. షెడ్యూల్డు ప్రాంతాల పాలన కోసం ప్రత్యేకంగా రాజ్యాంగం ఐదవ షెడ్యూలులో నియమాలు పొందుపరిచారు.

షెడ్యూల్డు ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతాలుగా కూడా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో షెడ్యూల్డు ప్రాంతాలు విస్తరించి వున్నాయి.

షెడ్యూల్డు ప్రాంతాలలో గల భూములపై బదలాయింపుల ద్వారా గిరిజనేతరులకు హక్కులు సంక్రమించవు. గిరిజనులకు మాత్రమే భూములపై ప్రత్యేక హక్కులు వుంటాయి. ఆ హక్కులను రక్షించడానికి ప్రత్యేక చట్టాలు, నిబంధనలు వున్నాయి.

గిరిజనుల భూములు రక్షణ కోసం బ్రిటిష్ కాలంలోనే 1917లోనే భూ బదలాయింపు చట్టం రూపొందించారు. స్వాతంత్ర్యం అనంతరం 1959 లో భూమి క్రమబద్ధీకరణ నిబంధనలు ప్రభుత్వం రూపొందించింది. తర్వాత వాటిని సవరిస్తూ 1970లో భూ నిబంధనలు ప్రభుత్వం తీసుకువచ్చింది. వీటి ద్వారా గిరిజనులు, గిరిజనేతరుల మధ్య భూ బదలాయింపులు నిషేదింపబడ్డాయి. అలాగే గిరిజనేతరులు మధ్య కూడా భూ బదలాయింపులు నిషేదింపబడ్డాయి.

అయినప్పటకీ, ఈ భూములను గిరిజనేతరులు కూడా అనుభ విస్తున్నారు. దీని వలన గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకమైనది. మైదాన ప్రాంతాల నుండి గిరిజనేతరులు షెడ్యూల్డు ప్రాంతాలకు వలస పోతూనే వున్నారు. గిరిజనుల భూములను సాగు చేస్తూనే వున్నారు. చట్టంలోని లొసుగులు మరియు అమలుకు పటిష్ఠ యంత్రాంగం లేకపోవడం, అలాగే హక్కుల పట్ల గిరిజనులకు సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణం.

భూమి చట్టాల్లో "అటవీ హక్కుల గుర్తింపు చట్టం" ఒకటి. భారత ప్రభుత్వం 2006లో గిరిజనులకు మరియు ఇతర సంప్రదాయ అటవీ

నివాసితులకు వారి అటవీ భూములపై వ్యక్తిగత మరియు ఉమ్మడి అటవీ హక్కులను గుర్తిస్తూ "అటవీ హక్కుల గుర్తింపు చట్టం" చేసింది. ఈ చట్టం షెడ్యూల్డు ప్రాంతాలకే కాదు మైదాన ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. 13, డిసెంబర్ 2005 నాటికి దరఖాస్తుదారుల ఆధీనంలో అటవీ భూములు వున్నట్లుగా ఆధారాలు ఉండాలి. అటవీ వనరుల నిర్వహణ హక్కులతో పాటు అనేక అటవీ హక్కులు కూడా చట్టం గుర్తించింది.

1996లో భారత ప్రభుత్వం, షెడ్యూల్డు ప్రాంతాలలో స్థానిక పాలన ఉద్దేశించి ప్రత్యేకంగా పంచాయితీ నిబంధనల విస్తరణ చట్టం (PESA) కూడా చేసింది. దీని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం 1998లో షెడ్యూలు ప్రాంతాల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర పంచాయితీరాజ్ చట్టాన్ని సవరించి కొత్త చట్టాన్ని తెచ్చింది. దీని ద్వారా గ్రామ సభలకు, గ్రామ పంచాయితీలకు, మండల ప్రజా పరిషత్‌లకు స్థానిక పాలనలో ప్రత్యేక అధికారాలు, బాధ్యతలు కల్పించబడ్డాయి. స్థూలంగా అవి అభివృద్ధి పథకాల, ఉపాధి పథకాల అమలు లబ్దిదారుల ఎంపిక, మద్యపాన నిషేధం, ఖనిజ తవ్వకాలకు అనుమతులు, అన్యాక్రాంతం అయిన గిరిజన భూములను తిరిగి తీసుకునే అధికారం, చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ, చిన్న తరహా అటవీఫలసాయంపై హక్కు, గ్రామ సంతల నిర్వహణ, ఉప ప్రణాళిక అమలు, భూ నిర్వాసితులకు నష్టపరిహారం, విద్యా, వైద్య సదుపాయాల నిర్ణయాలపై ప్రత్యేక అధికారాలకు సంబంధించినవి.

| మీకు తెలుసా? |
|---|
| **అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఆగష్టు 9న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు.** |

చట్టం అనేక అధికారాలు స్వయంపాలన కోసం కల్పించినప్పటికీ అమలు కావడంలేదు. గ్రామ సభలకు కల్పించిన అధికారాలు స్థానిక పాలనలో కీలకం. గిరిజనులు తమ స్వయం పాలన కోసం ఏర్పరిచిన చట్టాలను అవగాహన చేసుకొనుటకు ఆ చట్టాలను గూర్చి క్లుప్తంగా తెలుసుకోవలసిన అవసరం వున్నది.

# 2. ఏజెన్సీ ప్రాంత న్యాయ పాలన - సివిల్ కోర్టులు

గిరిజన ప్రాంత వనరులపై పట్టు సాధించేందుకు, గిరిజనేతరుల్ని తమ ఏజెంట్లుగా బ్రిటిష్ పాలకులు నియమించుకున్నారు. వారికి అక్కడ కొన్ని సౌకర్యాలను కల్పించి స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనేటట్లు చేయగలిగారు. తమ ప్రయోజనాలు నెరవేరతాయని బ్రిటీష్ పాలకులు భావించారు.

బ్రిటీష్ ప్రభుత్వం పిలుపునందుకుని శతాబ్ద కాలం క్రితమే కొందరు గిరిజనేతరులు గిరిజన ప్రాంతాలకు చేరుకొని, స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. దాంతో అమాయక గిరిజనులను దోపిడీ చేయడం మొదలైంది. కాలక్రమేణా అధికార, అనధికార యంత్రాంగపు మద్దతుతో చట్టాలలో గల లొసుగులతో గిరిజనేతరులు బలపడ్డారు.

ఆనాడు నెలకొన్న గిరిజన వ్యతిరేక పరిస్థితి ఎన్నో పోరాటాలకు దారి తీసింది. గిరిజనుల పోరాటాలకు తలొగ్గిన ప్రభుత్వం గిరిజనులకు అనివార్యంగా వారికంటూ కొన్ని ప్రత్యేక చట్టాలను, నిబంధనలను రూపొందించింది. అందులో ముఖ్యమైనది "ఏజెన్సీ ప్రాంత న్యాయ పాలన."

## గంజాం, వైజాగ్‌పట్నం చట్టం 1839 :

ఏజెన్సీ ప్రాంతాల పాలనకు సంబంధించినంత వరకు ఇది మొదటి చట్టం. న్యాయ పరిపాలన కోసం సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం, రెవెన్యూ వసూళ్ళ కోసం ఈ చట్టం ద్వారా మొదటిసారి బ్రిటీష్ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లను తమ ఏజంట్లుగా నియమించుకుంది.

## షెడ్యూల్డు జిల్లాల చట్టం 1874 :

షెడ్యూల్డు ప్రాంతాలలో ఆనాటికే అమలులో వున్న చట్టాలను నిర్ధారించడం కష్టమవ్వడంతో 1874లో షెడ్యూల్డు జిల్లాల చట్టం పేరిట ప్రభుత్వం ఒక చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం షెడ్యూల్డు ప్రాంతాలను నిర్ధారించడానికి,

అప్పటికే అమలులో వున్న స్థానిక ప్రభుత్వపు చట్టాలలో మార్పులు లేదా యధావిధిగా కొనసాగించడానికి అధికారం ఇచ్చింది. న్యాయ పాలన కొనసాగించేందుకు తగు నియమాలు రూపొందించే అధికారం కూడా ఈ చట్టం కల్పిస్తుంది. అందులో భాగంగానే ఏజెన్సీ ప్రాంత న్యాయ పాలన నియమాలు 1924లో రూపొందించబడ్డాయి.

## ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంత న్యాయ పాలన :

గంజాం, వైజాగ్‌పట్నం, గోదావరి జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతాలను పునర్వ్యవస్థీకరణ చేసి 13-8-1924 నుండి ఏజెన్సీ నియమాలను అమలు చేస్తూ వచ్చారు. ప్రభుత్వ ఏజంట్లయిన జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకంగా వుండేందుకు, ఏజెన్సీ ప్రాంత పరిపాలనకు, అధికారాల నియంత్రణకు ఇవి ప్రధానంగా ఉద్దేశించబడ్డాయి.

ఆనాటి మద్రాసు రాష్ట్ర ఆధీనంలో గల గంజాం, వైజాగ్‌పట్నం, గోదావరి జిల్లాలకు వర్తింపచేసినప్పటికీ తర్వాత ఏజెన్సీ నియమాలను 1963లో నిబంధనల సవరణ పేరిట ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు కూడా విస్తరింపజేసారు.

ఈ నియమావళి ప్రకారం ఆయా జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల వరకు, జిల్లా కలెక్టర్లు జిల్లా మేజిస్ట్రేట్‌లుగా, జిల్లా జడ్జీలుగా, రాష్ట్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. ఇప్పటికీ ఈ నియమాలే షెడ్యూల్డు ప్రాంతాలలో అమలులో వున్నాయి.

## ఏజెన్సీ నియమావళి - ముఖ్య అంశాలు :

ఈ నియమాల వలన గిరిజనులకు అనేక సౌకర్యాలు ఏర్పడ్డాయి. వీటి వలన వారికి ప్రత్యేక న్యాయ పాలన యంత్రాంగం ఏర్పడింది. కోర్టు ఫీజులు, దావాల్లో మినహాయింపులు లభించాయి. ఇతర ప్రాంత కోర్టుల డిక్రీ అమలుకు జిల్లా కలెక్టర్ అనుమతి కావల్సిన పరిస్థితి ఏర్పడింది.

1. ఏజెన్సీ ప్రాంతాలలో సివిల్ కేసులు పరిష్కారం కోసం న్యాయ పరిపాలనా యంత్రాంగం ఏర్పాటయింది.
2. కోర్టు ఫీజులు, దావా విలువ విషయంలో మినహాయింపులు వున్నాయి
3. నష్టపరిహారం, పశువులను కోల్పోవడం, నింద లేక అపవాదు మోపడం, నిందా పూర్వక భాషను వాడడం, దౌర్జన్యం వంటి కేసులలో వాదిగాని, అప్పీలుదారుడు గాని కోర్టు ఫీజు చెల్లించలేని స్థితిలో వున్నాడని న్యాయస్థానం నమ్మితే వారికి కోర్టు ఫీజు నుండి మినహాయింపు లభిస్తుంది.
4. ఏజెన్సీ ప్రాంత స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలలో మైదాన ప్రాంత కోర్టులు జారీ చేసిన డిక్రీని జిల్లా కలెక్టరు అనుమతితోనే అమలు చేయాలి.
5. ఈ ప్రాంతాలకు నిర్ధేశించిన ఏజెన్సీ నియమాలు మరియు ప్రత్యేకంగా ఉదహరించిన సివిల్ ప్రొసీజర్ కోడ్ నియమాలు మినహా ఏ ఇతర నియమాలు సివిల్ కేసులు విచారణకు వర్తించవు.
6. ఈ నియామావళి ప్రకారం హైకోర్టుకు విస్తృత అధికారం ఇవ్వబడింది. అప్పీలు చేసుకునేందుకు పున:పరిశీలనకు, పర్యవేక్షణకు అధికారం ఇవ్వబడింది.
7. ఏజెన్సీ కోర్టులో ప్లీడరుగా ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుగా సనద్ (గ్రాంటు) ద్వారా అనుమతి ఇచ్చే అధికారం జిల్లా కలెక్టరుకు ఇవ్వబడింది.

## ఏజెన్సీ న్యాయ పరిపాలనా విభాగం - నిర్మాణం :

ఏజెన్సీకి ప్రత్యేక న్యాయ విభాగం లేదు. రెవెన్యూ శాఖాధికారుల పరిధిలోనే న్యాయ విభాగము వుంటుంది. సివిల్ తగాదాల విషయంలో మూడంచెలుగా రెవెన్యూ అధికారులచే కోర్టులు నిర్వహించబడతాయి. సివిల్

కోర్టులు నిర్వహించు రెవెన్యూ అదికారుల హోదాలు, వారి పరిధిలో గల కోర్టుల వివరములు ఈ క్రింది విధంగా వుంటాయి.

**ఏజెన్సీ కోర్టులు ఈ క్రింది పేర్కొనబడిన నిర్మాణాన్ని కలిగి ఉంటాయి.**

## 1) ఏజెంట్ టు ది గవర్నమెంట్ (జిల్లా కలెక్టర్) కోర్టు :

**విచారణ పరిధి :** ఐదు వేల రూపాయల విలువకు పైబడిన సివిల్ దావాలపై కలెక్టర్ కోర్టులో విచారణ జరుగును. సివిల్ తగాదాలలో ఏజెన్సీ డివిజినల్ అధికారి / ఆర్.డి.ఓ వారి కోర్టులో ఇవ్వబడిన తీర్పులుపై కూడా అప్పీళ్ళు విచారణ చేయు అధికారము కలెక్టరు / ఏజెంటు కోర్టుకు వుంటుంది.

దిగువ కోర్టుల్లోని పెండింగులో వున్న కేసులను ఒక కోర్టు నుండి మరొక కోర్టుకు బదలాయించే అధికారము కలెక్టరుకు వుంటుంది. ఆస్తుల పరిరక్షణ విషయంలో తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తూ "రిసీవర్"ను నియమించి ఆస్తులను స్వాధీనము చేసుకొను అధికారము, అమ్మించు అధికారము కూడా కలదు.

ఈ కోర్టు నుండి వెలువడిన తీర్పులపై మూడు నెలల్లోగా హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చును. జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్‌గా వ్యవహరింప బడుదురు. మెజిస్ట్రేట్ హోదాలో శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక అధికారములు కలెక్టర్ కలిగియున్నారు.

## 2) ఏజెన్సీ డివిజనల్ ఆఫీసర్ (సబ్ కలెక్టర్ / ఆర్.డి.ఓ) కోర్టు :

**విచారణ పరిధి :** రెవిన్యూ డివిజినల్ ఆఫీసరు / సబ్ కలెక్టర్ ను ఏజెన్సీ డివిజినల్ ఆఫీసరుగా పేర్కొంటారు. ఈ కోర్టు పరిధిలో రూ. 500/–ల నుండి రూ. 5,000/–లు విలువలోపు గల సివిల్ దావాలు పరిష్కరించబడును. ఈ కోర్టు పరిధిలోగల దిగువ కోర్టుల కేసులను ఒక కోర్టు నుండి మరొక కోర్టుకు బదిలి చేసే అధికారము ఏజెన్సీ డివిజినల్ ఆఫీసర్‌కు వుంటుంది. తాత్కాలిక ఉత్తర్వులు ద్వారా "రిసీవర్"ను నియమించి, ఆస్తుల పరిరక్షణ విషయమై చర్యలు తీసుకోవచ్చును. అలాగే "ఇంజక్షన్" (నిషేదాజ్ఞ) ఉత్తర్వులు

జారీ చేయు అధికారము కూడా కలదు. ఏజెన్సీ మున్సిఫ్ కోర్టు ఇచ్చిన తీర్పుపై దాఖలైన అప్పీళ్ళు విచారణ చేయు అధికారము కూడా కలదు. కోర్టు ఒక చర్యను నిలుపుదల జేయమనీ లేదా సూచించిన విధంగానే చేయమని జారీ చేసే ఉత్తర్వులను "ఇంజక్షన్" ఉత్తర్వులు అంటారు.

**గమనిక :** రాష్ట్రంలో కొన్ని జిల్లాల గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం సంచార న్యాయస్థానాలు (మొబైల్ కోర్టులు) నెలకొల్పింది. ఆ కోర్టులను సబ్ కలెక్టర్ లేదా ఆర్.డి.ఓలు కాకుండా ప్రత్యేక అధికారి నిర్వహిస్తారు. ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లాలో రంపచోడవరంలో నెలకొల్పిన సంచార న్యాయ స్థానానికి నియమించిన ప్రత్యేక అధికారి సివిల్ కేసులు విచారించే అధికారం కలిగి వున్నారు.

### 3) ఏజెన్సీ మున్సిఫ్ / మండల రెవిన్యూ అధికారి :

**విచారణ పరిధి :** సివిల్ తగాదాల విచారణ సమయంలో మండల రెవిన్యూ అధికారి "ఏజెన్సీ మున్సిఫ్"గా వ్యవహరిస్తారు. ఈ కోర్టు పరిధిలో రూ. 500/-లు విలువలోపు గల దావాలను విచారణ చేసి పరిష్కరించవచ్చు. ఏజెంటు టు ది గవర్నమెంట్ (కలెక్టర్) అనుమతిపై ఆస్తుల సంరక్షణకు "రిసీవర్"ను నియమించి ఆస్తులను స్వాధీనము చేసుకొనమని లేదా అమ్మి ఆ మొత్తం సొమ్మును డిపాజిట్ చేయమని ఆదేశించే అధికారం కలదు. అలాగే ఇంజక్షను ఉత్తుర్వులు కూడా జారీ చేయవచ్చును.

## ఏజెన్సీ నియమాలు కింద సివిల్ కేసులు పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కోర్టులు

ఏజంట్ టు ది గవర్నమెంట్
(జిల్లా కలెక్టరు)

↑

ఏజెన్సీ డివిజినల్ ఆఫీసర్
(సబ్ కలెక్టర్ / ఆర్.డి.ఓ)

↑

ఏజెన్సీ మున్సిఫ్
(మండల రెవిన్యూ అధికారి)

### మీకు తెలుసా?

**ఏజెన్సీ ప్రాంతం అంటే ఏమిటి?**

ఆనాటి పరిస్థితులను బట్టి ఏ ప్రాంతంలోనైనా ప్రత్యేకంగా చట్టాలు అమల్లో లేకపోతే దానిని ఏజెన్సీ ప్రాంతం అని బ్రిటీష్ ప్రభుత్వం పిలిచేది. అలాంటి ప్రాంతాలను బ్రిటీష్ ప్రభుత్వం జిల్లా కలెక్టరు స్థాయిలోని ఏజెంట్లు అనబడేవారి ఆధీనంలో వుంచింది. ఏజెంటు ద్వారా పాలించబడుతున్న ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతాలుగా పిలుస్తారు.

### మీకు తెలుసా?

ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా జిల్లా కోర్టులు, జిల్లా జడ్జిలు వుంటారు. వారే జిల్లాలో సాధారణ న్యాయ పాలనకు బాధ్యులుగా పనిచేస్తారు. అయితే వీరు షెడ్యూల్డు ప్రాంతాలకు సారధ్యం వహించరు. రెవిన్యూ అధికారులే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో న్యాయాధికారాలు కలిగి వుంటారు. వీరికే సివిల్ కేసులు పరిష్కారం చేసే అధికారము వుంటుంది.

**సివిల్ కేసులు :**

| విచారణ అధికా పేరు | వారి ఉద్యోగం | విచారించే కేసులు |
|---|---|---|
| 1. ఏజెన్సీ మున్సిఫ్ | మండల రెవిన్యూ అధికారి | సివిలు కేసులు |
| 2. ఏజెన్సీ డివిజినల్ ఆఫీసర్ | సబ్ కలెక్టర్ / ఆర్.డి.ఓ | |
| 3. ఏజెంటు టు గవర్నమెంటు | జిల్లా కలెక్టర్ | |

# 3. షెడ్యూల్డు ప్రాంత పాలన - ప్రత్యేక రాజ్యాంగ హక్కులు

బ్రిటీష్ పాలన కాలంలో గిరిజన ప్రాంతాలను వెనుకబడిన ప్రాంతాలుగా పిలిచేవారు. ఆ ప్రాంతాల్లో దేశ సాధారణ పరిపాలన చట్టాలు అమలులో వుండేవి కావు. సాధారణ పరిపాలన చట్టాల అమలు నుంచి అవి పాక్షికంగా లేదా పూర్తిగా మినహాయించిన ప్రాంతాలుగా వుండేవి. ఆ ప్రాంతాలలో నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ కార్యనిర్వాహక ఉత్తర్వుల ఆధారంగా పరిపాలన జరిగేది.

గిరిజన ప్రాంతాలలో గిరిజనుల ఆచార, సంప్రదాయాలు, సామాజిక జీవనం మిగిలిన మైదాన ప్రాంత ప్రజలకు భిన్నంగా వుండడమే దానికి కారణం. గిరిజన ప్రాంతాలలో పాలనాపరమైన వ్యత్యాసం భారతదేశ స్వాతంత్ర్యం అనంతరము కూడా కొనసాగుతూ వచ్చింది. గిరిజన ప్రాంతాల పాలన వ్యవహారంలో చారిత్రకంగా వచ్చిన చట్ట పరమైన మార్పులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

## భారత ప్రభుత్వ చట్టం 1919 :

ఈ చట్టం ద్వారా బ్రిటిష్ ఇండియాలోని ఏ ప్రాంతాన్నైనా వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించే అధికారం గవర్నర్ జనరల్‌కు ఇవ్వబడింది. ఆ ప్రాంతానికి సంబంధించిన మార్పులు చేర్పులతో చట్టాలు చేసే అధికారం కూడా ఇవ్వబడింది.

ఇలా ప్రకటించబడ్డ ప్రాంతానికి భారత శాసనసభ చేసే ఏ శాసనమైనా వర్తించాలంటే ఆ ప్రాంతాలకు మినహాయింపులతో మాత్రమే వర్తిస్తుంది. స్థానిక శాసనసభ రూపొందించిన శాసనాల అమలు విషయంపై కూడా గవర్నర్ జనరల్ ఆదేశాలు ఇవ్వవచ్చు.

## భారత ప్రభుత్వ చట్టం 1935 :

సాధారణ పాలన నుంచి పూర్తిగా మినహాయించిన ప్రాంతాలు, పాక్షికంగా మినహాయించిన ప్రాంతాలు, వాటి పరిపాలనకు సంబంధించినదే ఈ చట్టం. వెనుకబడిన ప్రాంతాలు గవర్నర్లచే పాలించబడేవి.

గిరిజన ప్రాంతాల పరిపాలనలో గవర్నరు, గవర్నర్ జనరల్‌కు ఏజెంటుగా వ్యవహరించేవారు. పాక్షికంగా మినహాయించిన ప్రాంతాల పరిపాలనా బాధ్యత మాత్రం గవర్నర్ జనరల్‌దే అయినప్పటికీ, ఈ బాధ్యతను ప్రత్యేక బాధ్యతగా గవర్నరే తన విచక్షణాధికారంతో నిర్వహించాల్సి వుండేది.

ఈ ప్రాంతంలో శాంతి, సుపరిపాలన కోసం గవర్నర్, నిబంధనలు చేసే అధికారాన్ని ఈ చట్టం కల్పించింది. శాసనసభలో చేసే చట్టాలను ఈ ప్రాంతాలకు అమలు చేసేందుకు వీలులేదు. చట్టాలను అమలుచేసే విషయంలో లేదా అలాంటి చట్టాలలో మార్పులు చేసే విషయంలో గవర్నర్‌కు అధికారం వుంది. అయితే ఆ ప్రాంతాలకు సంబంధించిన గవర్నర్‌కు ఉన్న శాసనాధికారం గవర్నర్ జనరల్ సమ్మతికి లోబడే వుంటుంది.

భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం పాక్షికంగా మినహాయించిన ప్రాంతాలను, భారత రాజ్యాంగం ఐదవ షెడ్యూల్‌లో, అలాగే పూర్తిగా మినహాయించిన ప్రాంతాలను రాజ్యాంగం ఆరవ షెడ్యూల్‌లో చేర్చారు. గిరిజనులు అధికంగా నివసించే ఈ ప్రాంతాలకు ప్రత్యేక రాజ్యాంగ నియమాలు రూపొందించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ రాజ్యాంగం ఐదవ షెడ్యూల్లో చేర్చబడిన గ్రామాలు వున్నాయి. అవి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో వున్నాయి. ఇలా చేర్చబడిన ప్రాంతాలను "షెడ్యూల్డు ప్రాంతాలు"గా పిలుస్తారు. ఇదే ప్రాంతాన్ని ఏజెన్సీ ప్రాంతం అని కూడా అంటారు.

## షెడ్యూల్డు ప్రాంత పాలన : రాజ్యాంగం 244వ అధికరణ :

రాజ్యాంగం ఐదవ షెడ్యూలులో పొందుపరచబడిన నిబంధనలన్నీ రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన, నియంత్రణకు సంబంధించినవి. ప్రతీ ఏడాది లేదా రాష్ట్రపతి కోరినప్పుడు షెడ్యూల్డు ప్రాంత పరిపాలన గురించి గవర్నర్ నివేదిక పంపవలసి వుంటుంది.

రాష్ట్రంలో గిరిజన సంక్షేమం కొరకు, వారి పురోభివృద్ధికి సంబంధించి సలహాలు ఇచ్చేందుకు రాష్ట్ర గిరిజన శాసనసభ్యులతో కూడిన "గిరిజన సలహా మండలి"ని ఏర్పర్చాలి. షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజన భూముల బదలాయింపును నిషేధించడానికి లేదా నిరోధించడానికి వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నియమాలను, నిబంధనలను చేసే అధికారం గవర్నరుకు వుంటుంది. షెడ్యూల్డు ప్రాంతంలో మంచి పాలన మరియు శాంతి ఒనగూర్చేందుకు తగిన నిబంధనలను చేసే అధికారం గవర్నరుకు వుంటుంది.

అలాగే షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయడానికి పార్లమెంటు లేదా శాసనసభలు చేసిన చట్టాలను గరవ్నరు సవరించవచ్చు. లేదా వాటి అమలు నిలుపుదల చేయవచ్చు. ఇటువంటి చర్యలకు పూనుకొన్నప్పుడు 'గిరిజన సలహా మండలి" సలహాను పొందాలి.

షెడ్యూల్డు ప్రాంతాలకు గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా గవర్నరు రూపొందించిన నిబంధనలు రాష్ట్రపతి అనుమతి పొందిన తరువాతనే అవి షెడ్యూల్డు ప్రాంత "రెగ్యులేషన్"గా అమల్లోనికి వస్తాయి. రాష్ట్రంలో ఏ ప్రాంతాన్నైనా షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించే అధికారం రాజ్యాంగం 244వ అధికరణ కింద రాష్ట్రపతికి వుంటుంది. అసెంబ్లీ, పార్లమెంటు లో చేసే శాసనాలను 'చట్టాలు' అంటారు. రాజ్యాంగ అధికరణ 244 కింద రూపకల్పన చేసే శాసనాలను "రెగ్యులేషన్స్" అంటారు.

## షెడ్యూల్డు తెగల జాతీయ కమీషన్ :

గిరిజనుల హక్కుల పరిరక్షణ కొరకు కొన్ని ప్రత్యేక అధికారాలతో రాజ్యాంగ సవరణ 338 ఎ అధికరణ ద్వారా "షెడ్యూల్డు తెగల జాతీయ కమీషన్" కేంద్రంచే ఏర్పాటు చేయబడింది. 8 రకాల అధికారాలతో తొలుత షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల జాతీయ కమీషన్ 07-06-1990 నుండి ఏర్పడింది. తరువాత 2003లో 89వ రాజ్యాంగ సవరణ ద్వారా అధికరణ 338ఎ కింద ప్రత్యేక ఎస్.టి జాతీయ కమీషన్ ఏర్పడింది.

గిరిజనుల హక్కులకు సంబంధించిన ఫిర్యాదులపై దర్యాప్తు, విచారణ, గిరిజనుల సామాజిక, ఆర్థిక ప్రణాళిక ప్రక్రియలో పాల్గొనడం మరియు సలహాలు ఇవ్వడం, వారి పురోగతిని అంచనావేయడం, గిరిజనుల అభివృద్ధి హక్కుల పరిరక్షణకు తీసుకోవలిసిన చర్యలు వార్షిక నివేదిక రాష్ట్రపతికి సమర్పించడం, గిరిజన హక్కుల, సంక్షేమ కార్యక్రమాల అమలుకు తగు సిఫార్సులు ఇచ్చే అధికారం, పార్లమెంట్ చట్టాలు లేదా ఇతర నియమాలకు లోబడి గిరిజనులకు సంబంధించిన విషయాలలో రాష్ట్రపతి అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించడం వంటి విధులు ప్రత్యేకంగా ఏర్పడిన షెడ్యూల్డు తెగల జాతీయ కమీషన్ చేపడుతుంది.

గిరిజనుల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులుపై దర్యాప్తు, విచారణ జరుపు సమయంలో షెడ్యూల్డు తెగల జాతీయ కమీషన్‌కు సివిల్ కోర్టులకు వుండే అధికారాలు వుంటాయి. విచారణకు సంబంధించిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసే అధికారం, రికార్డ్సు హాజరి పెట్టమని ఆదేశించడం, సాక్ష్యం నమోదు చేయడం తగు నిర్ణయాలు తీసుకొనే అధికారం వుంటుంది.

సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులలో గిరిజనులు కూడా వుంటారు. అందువల్ల రాజ్యాంగంలో అటువంటి తరగతుల ప్రయోజనాల కోసం పొందుపరచిన రాజ్యాంగ నిబంధనలు గిరిజనులకు కూడా వర్తిస్తాయి. గిరిజనుల పురోగతికి, హక్కుల పరిరక్షణ కోసం కూడా ప్రత్యేకంగా రాజ్యాంగ నియమాలు వున్నాయి.

రాజ్యాంగ అధికరణలు ఈ క్రింది పట్టికలో చూడవచ్చు

| అధికరణ | వివరణ |
|---|---|
| 15 | విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల ముఖ్యంగా షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల పురోభివృద్ధికి, మిగిలిన రాజ్యాంగ అధికరణలతో ప్రమేయం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు చేయవచ్చు. |
| 16 | ప్రభుత్వ సర్వీసులలో వెనుకబడిన తరగతుల వారికి తగినంత ప్రాతినిధ్యం లభించడం లేదని ప్రభుత్వం భావించినప్పుడు వారి నియామకాల లేదా ఉద్యోగాల కేటాయింపులకు కావలిసిన ప్రత్యేక నిబంధనలు చేయడానికి ఆటంకం లేదని ఈ అధికరణ స్పష్టం చేస్తోంది. |
| 46. | బడుగు వర్గాల ప్రజలు ముఖ్యంగా ఎస్.సి., ఎస్.టి., ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించి, సామాజిక అన్యాయం, అన్ని రకాల దోపిడీల నుండి ప్రభుత్వం రక్షణ కల్పించాలని భారత రాజ్యాంగం ఈ అధికరణ ద్వారా తెలియజేస్తోంది. |
| 244 | షెడ్యూల్డు ప్రాంత పాలనకు సంబంధించిన అధికరణ. షెడ్యూల్డు ప్రాంత చట్టాలు రూపకల్పనకు గవర్నరుకూ, షెడ్యూల్డు ప్రాంతాలుగా ప్రకటించడానికి రాష్ట్రపతికి అధికారాలు ఇచ్చిన అధికరణ. |
| 275 | రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో సమానంగా షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర నికరాదాయాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్రం వివిధ అభివృద్ధి పథకాలకు భారత సంచిత నిధి నుండి ఖర్చు పెట్టవచ్చు. |

| అధికరణ | వివరణ |
|---|---|
| 330, 332, 334 | పార్లమెంటు మరియు శాసనసభా నియోజక వర్గ స్థానాలను ప్రత్యేకంగా షెడ్యూల్డు తెగల వారికి కేటాయింపు చేయవచ్చు. |
| 335 | రాష్ట్ర, కేంద్ర ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు |
| 338 | ఒక ప్రత్యేక అధికారిని నియమించి గిరిజనుల కొరకు రూపొందించిన వివిధ రక్షణ నియమాల అమలు తీరును పరిశీలించి నివేదికను సమర్పించవలసినదిగా రాష్ట్రపతి కోరవచ్చు. |
| 338 ఎ | గిరిజన హక్కుల, అభివృద్ధికి పర్యవేక్షణ కోసం ప్రత్యేక జాతీయ కమీషన్ ఏర్పాటు |
| 339 | గిరిజన సంక్షేమం మరియు రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన తీరుపై నివేదించడానికి రాష్ట్రపతి ఒక సంఘాన్ని నియమించవచ్చు. |
| 342 | రాష్ట్రపతికి ఏ జాతినైనా షెడ్యూల్డు తెగలుగా, గ్రూపులుగా ప్రకటించే అధికారం |

# 4. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఏ) - అభివృద్ధి విధానాలు

బ్రిటీష్ కాలం నుండి గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాలను వెనుకబడిన ప్రాంతాలుగా దర్మిలా ఏజెన్సీ ప్రాంతాలుగా, రాజ్యాంగం ఏర్పడిన తర్వాత వాటిని షెడ్యూల్డు ప్రాంతాలుగా పిలువబడుతున్నాయని మనం ఇంతకు ముందు పాఠాలలో తెలుసుకున్నాం. ఆ ప్రాంతాల పాలనకు ప్రత్యేక శాసనాలు మరియు రాజ్యాంగ నియమాలు రూపొందించబడినవని కూడా తెలుసుకున్నాం.

అలాగే గిరిజన ప్రాంతాలలో నివసించే గిరిజనుల అభివృద్ధి విషయంలో కూడా పలు విధానాలు ప్రభుత్వం అమలు చేస్తూ వచ్చింది. గిరిజనులకు మైదాన ప్రాంత వాసుల జోక్యం లేకుండా, వారిని వేరుగా జేస్తూ వారికి అవసరమగు రక్షణ, అభివృద్ధి చర్యలు చేపట్టాలనే విధానంపై కూడా బ్రిటీష్ కాలంలో చర్చ నడిచింది. దీనికి విరుద్ధంగా గిరిజనులను, గిరిజనేతరులతో కలిపి అభివృద్ధి చర్యలు చేబడితేనే గిరిజనాభివృద్ధి సాధ్యమని మరొక వాదన బలంగా ముందుగా వచ్చింది. అయతే ఈ రెండు విధానాలు మధ్య సమతూకంతోనే అభివృద్ధి సాధ్యమని మన దేశ ప్రధమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సూత్రీకరించారు. గిరిజనాభివృద్ధికి నెహ్రూ పంచశీల సూత్రాలు రూపొందించారు. ఆ సూత్రాలు ఈనాటికి ప్రమాణికమే.

## నెహ్రూ పంచశీల సూత్రాలు :

1) గిరిజనుల స్వీయ విజ్ఞానం ఆధారంగా మరియు బయట ప్రజల విలువలు వారిపై రుద్దే చర్యలు నివారిస్తూ వారిని అభివృద్ధి పరచాలి.

2) భూమి మరియు అటవీ భూములపై గిరిజనులకు వుండే హక్కులు గౌరవించాలి.

3) పరిపాలన మరియు అభివృద్ధి పనులలో గిరిజనులకు తగు శిక్షణ ఇవ్వాలి. మైదాన ప్రాంత వారిని అధికంగా గిరిజన ప్రాంతాలలోకి ప్రోత్సహించడం నివారించాలి.

4) గిరిజన ప్రాంతాలలో అనేక బహుళ కార్యక్రమాల అమలు లేదా విస్తృత పరిపాలన చర్యలు చేపట్టరాదు.


5) గిరిజనాభివృద్ధి ఫలితాలను అంకెలపై లేదా వారి అభివృద్ధి పేరుతో చేసిన ఖర్చు ఆధారంగా కాకుండా పరిణమించిన మానవ స్వభావం ఆధారంగా కొలవాలి.

## గిరిజనాభివృద్ధి సంస్థలు :

భారతదేశంలో వ్యవసాయ రంగంలో అశాంతి మరియు కొన్ని గిరిజన ప్రాంతాలలో వామపక్ష తీవ్రవాదం నెలకొన్న సందర్భంగా నాల్గవ పంచవర్ష ప్రణాళిక సమయంలో 1971 -72లో గిరిజనాభివృద్ధి కోసం ఆరు ప్రత్యేక ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగానే మన రాష్ట్రంలో శ్రీకాకుళంలో గిరిజనాభివృద్ధి సంస్థ ఏర్పాటయింది.

అలా ఏర్పాటైన గిరిజనాభివృద్ధి సంస్థలే తరవాత సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఏ)లుగా ఐదవ పంచ వర్ష ప్రణాళిక కాలంలో 1979 ఏర్పాటయ్యాయి. గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం గిరిజన ఉప ప్రణాళిక విధానం తీసుకువచ్చింది. భౌగోళిక, గిరిజన జనాభా సాంద్రత, సామాజిక మరియు సంస్థల సేవల స్థితి మరియు అభివృద్ధి రేటు సూచికల ఆధారంగా ఐ.టి.డి.ఏలు ఏర్పాటయ్యాయి.

## ఐ.టి.డి.ఏ ఏర్పాటుకు మూల సూచికలు :





మన రాష్ట్రంలో సీతంపేట (శ్రీకాకుళం జిల్లా), పార్వతీపురం (విజయనగరం జిల్లా), పాడేరు (విశాఖపట్నం జిల్లా,) రంపచోడవరం, చింతూరు (తూర్పు

గోదావరి జిల్లా), కె.ఆర్.పురం (పశ్చిమ గోదావరి జిల్లా),లో ఐ.టి.డి.ఏలు ఏర్పాటు కాగా, చెంచులు కోసం ప్రత్యేక ఐ.టి.డి.ఏ శ్రీశైలంలో (కర్నూల్ జిల్లా) మరియు యానాదుల కోసం నెల్లూరులో గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటు చేసింది. ఏర్పాటు చేసిన ఐ.టి.డి.ఏల ద్వారా సేవలు అందని మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక మైదాన ప్రాంత ఐ.టి.డి.ఏ ఏర్పాటయింది. ఐ.టి.డి.ఏలకు ప్రాజెక్ట్ అధికారి వుంటారు.

**మీకు తెలుసా?**

**ITDA (ఐ.టి.డి.ఏ) అనగా INTEGRATED TRIBAL DEVELOPMENT AGENCY**

**ఐ.టి.డి.ఏ విధులు :**



ప్రతీ ఐ.టి.డి.ఏకి పాలక మండలి వుంటుంది. ఐ.టి.డి.ఏకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వుంటారు. ఐ.టి.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి కార్యదర్శిగా వుంటారు. జిల్లాలో గల వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు సభ్యులుగా ఐ.టి.డి.ఏ పాలక మండలికి వుంటారు.

ఏక మార్గ పరిపాలన విధానం **(Single line Administration)** ద్వారా గిరిజనాభివృద్ధి కోసం 1986లో ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకుంది. అంటే అన్ని ప్రభుత్వ శాఖలు ఐ.టి.డి.ఏ నియంత్రణలో పనిచేయాలి. గిరిజనులు బహుముఖ అభివృద్ధి కోసం ప్రణాళికలు రచనలో ఐ.టి.డి.ఏల పాత్ర కీలకంగా వుంటుంది.

## గిరిజన ఉప ప్రణాళిక విధానం :

ఐదవ పంచవర్ష ప్రణాళిక కాలంలోనే గిరిజన ఉప ప్రణాళిక విధానం కూడా అమలులోకి వచ్చింది. రెండు లక్ష్యాలతో ఈ విధానం రూప కల్పన చేశారు. ఒకటి గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, పేదరిక స్థితి నుంచి పైకి తీసుకురావడం. రెండవది అన్ని రకాల దోపిడీ నుండి గిరిజనులకు రక్షణ. గిరిజనులు మరియు గిరిజనేతరుల మధ్య అభివృద్ధిలో అంతరాలు వున్నాయి. ప్రత్యేకంగా గిరిజనుల పురోగతికి చర్యలు తీసుకోకపోతే గిరిజన మరియు గిరిజనేతరుల మధ్య అభివృద్ధి అంతరాలు అలాగే కొనసాగే అవకాశం వుందని ప్రభుత్వం భావించింది.

అందువల్ల రాష్ట్ర జనాభాలో గిరిజనుల జనాభా శాతం ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు కనీసం ఆ శాతం నిధులు ప్రత్యేకంగా గిరిజనుల అభివృద్ధికి కేటాయించాలి. ఇది ప్రధాన ప్రణాళిక సూత్రం. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్.సి., మరియు ఎస్.టి. ఉప ప్రణాళిక చట్టం 2013లో తీసుకువచ్చింది. ఆ చట్టం గురించి తర్వాత పాఠాలలో కూడా తెలుసుకుందాం.

## మాడా (Modified Area Development Approach (MADA) విధానం:

గిరిజన సాంద్రత గల కొన్ని గ్రామాలు / తండాలు గిరిజన ఉప ప్రణాళికలో భాగం కాకపోవడం ప్రభుత్వం గమనించింది. అటువంటి ప్రాంతాలను గుర్తించి

వాటిని అభివృద్ధి చేసే విధానాన్ని "మాడా" అంటారు. ఆరవ పంచవర్ష ప్రణాళికలో "మాడా" విధానాన్ని ప్రవేశపెట్టారు. కనీసం పదివేలు జనాభా కలిగివుండి, గిరిజన గ్రామాలు /తండాలు ఒకేచోట వుండి, అందులో కనీసం 50 శాతం గిరిజనులు వుంటే ఆ ప్రాంతాలు గుర్తించి అభివృద్ధి చర్యలు చేపడతారు.

ఇటువంటి "మాడా"లు రాష్ట్రంలో 4 వున్నాయి. ఇంకా జనాభా తక్కువ అంటే ఐదు వేల జనాభా వుండి, కనీసం అందులో 50 శాతం గిరిజనులు వున్న ప్రాంతాలు గుర్తించి వాటిని ఒక గుంపుగా చేసి "మాడా"లో భాగం కూడా చేయవచ్చును. వీటినే గిరిజన "క్లస్టర్స్" విధానం అంటారు. ఇటువంటి "క్లస్టర్స్" రాష్ట్రంలో 6 వున్నాయి.

# 5. షెడ్యూల్డు ప్రాంత భూమి నిబంధనలు

గిరిజన ప్రాంతాలకు వర్తింపజేసిన బ్రిటిష్ పరిపాలనా విధానాలు, గిరిజనేతరుల ఆర్థిక దోపిడీలకు అడ్డుకట్ట వేయలేకపోయాయి. గిరిజనులు రాను రాను ఆర్థికంగా దిగజారిపోతూ వుంటే మరో ప్రక్క గిరిజనేతరులు మైదాన ప్రాంతాలు నుంచి గిరిజన ప్రాంతాలకు వలసలు పెరిగిపోయాయి. ఇలాంటి సమస్యల్లో ప్రధానమైనది గిరిజనుల భూమి పరాయికరణ సమస్య. గిరిజనేతరుల ఆర్థిక దోపిడీ మరియు గిరిజనుల భూమి హక్కు పరిరక్షణ కోసం బ్రిటీష్ హయాంలో చట్టాల రూపకల్పన జరిగింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గిరిజన భూమి హక్కుల పరిరక్షణ కోసం అనేక నిబంధనలు ప్రభుత్వం రూపొందించింది. అయితే ఇవన్నీ గిరిజనులకు న్యాయాన్ని అందివ్వగలుగుతున్నాయా ? అవి గిరిజనులకు ఏ మేరకు కాపాడగలుగుతున్నాయి? ఇవన్నీ మన ముందున్న ప్రధాన ప్రశ్నలు.


ఈ అంశాలపై చర్చించే ముందు స్థూలంగా గిరిజన ప్రాంతాల్లో భూమికి సంబంధించిన ఏఏ చట్టాలు రూపొందించబడ్డాయో తెలుసుకోవాలి.

**1. ఏజెన్సీ ప్రాంత వడ్డీ మరియు భూ బదలాయింపుల చట్టం 1917 :**

ఈ చట్టం 14-08-1917 నుండి అమల్లోనికి వచ్చింది. ఈ చట్టం ప్రకారం గిరిజనుల నుండి సంవత్సరానికి 24 శాతానికి మించి వడ్డీ వసూలు చేయకూడదు. అసలుకు మించి వడ్డీ వసూలు చేయకూడదు. చక్రవడ్డీ వసూలు చేయకూడదు. అప్పు ఇవ్వడానికి భూమి, నగలు, పంట వంటి వేటినీ హామీగా తీసుకోరాదు.

గిరిజనుల మధ్య జరిగే భూమి బదలాయింపులు ఈ చట్టం అనుమతిస్తుంది. అయితే గిరిజనులు మరియు గిరిజనేతరులు మధ్య జరిగే భూమి బదలాయింపులకు ఏజెంటు లేదా నిర్దేశిత అధికారుల వ్రాత పూర్వక అనుమతులు కావాలి. భూమి బదలాయింపులు కేసులన్నీ ఏజెన్సీ కోర్టుల్లోనే విచారణ జరగాలి. అక్రమ భూమి బదలాయింపులపై వచ్చిన ఫిర్యాదులుపై విచారణ చేసి సంబంధిత

గిరిజనులకు భూములు అప్పగించేందుకు అధికారులకు అధికారం వుంటుంది. షెడ్యూలు ప్రాంత భూమి బదలాయింపుల నిబంధనలు 1959లో అమలులోనికి రావడంతో, 1917 చట్టంలోని కొన్ని భాగాలను రద్దు చేశారు.




| బదలాయింపు అంటే? |
| --- |
| స్థిరాస్తి అమ్మకం, కౌలు, స్వాధీన తనఖా, అస్వాధీన తనఖా, దానం, మార్పిడి లేదా ఇతర స్థిరాస్తికి సంబంధించిన ఇతర లావాదేవీలు |

## 2. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూ బదలాయింపు నిబంధనలు 1/59

ఈ నిబంధనలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మరియు తూర్పు, పశ్చిమ గోదావరి, జిల్లాల షెడ్యూల్డు ప్రాంతాలలో 4-3-1959 న అమలులోనికి వచ్చాయి. తెలంగాణా ప్రాంత ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో 1-12-1963లో అమలులోనికి వచ్చాయి.

**ముఖ్యాంశాలు :**

1. గిరిజనులకు మరియు గిరిజనేతరులకు మధ్య భూమి బదలాయింపులు చెల్లవు. ఏజెంటు / ఏజెన్సీ డివిజనల్ అధికారి /

లేదా స్పెషల్ డిప్యూటీ కలెక్టరుకు పిటీషను పెట్టుకొని తన ఆస్తిని తిరిగి తనకు, లేదా తన వారసులకు స్వాధీనపర్చమని గిరిజనులు లేదా అన్యాక్రాంతం కాబడిన గిరిజన భూముల విషయములో గిరిజనుల ప్రయోజనాలు కోరే ఇతర వ్యక్తులు కోరవచ్చును.

2. బాకీలు చెల్లింపుకు సంబంధించిన కోర్టు తీర్పుల్లో సైతం షెడ్యూల్డు తెగల వారి స్థిరాస్తిని జప్తు చేయరాదు. గిరిజనేతరులకు అమ్మరాదు.

3. అన్యాక్రాంతం కాబడిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ప్పటికీ ఆ భూమిని సంబంధిత గిరిజనులు తీసుకోకపోయినా లేదా అతడి వారసులు జాడ తెలియకపోయినా అలాంటి భూమిని షెడ్యూల్డు తెగలకు చెందిన మరో వ్యక్తికి లేదా గిరిజనులతో కూడిన సహకార సంఘానికి ఇవ్వవచ్చు. అప్పుడు అది ప్రభుత్వ భూమిగానే పరిగణించబడుతుంది. 1/59 భూమి బదలాయింపు నిబంధనలు రాజ్యాంగబద్ధంగా వున్నాయని రాష్ట్ర హైకోర్టు 1969లో తీర్పు ఇచ్చింది.

## 3. భూమి బదలాయింపు కేసుల విచారణ నియమాలు 1969 :

1. షెడ్యూల్డు ప్రాంతంలో భూమి బదలాయింపు నిబంధనలకు విరుద్ధంగా అనుభవిస్తున్న గిరిజనేతరుల సాగును ప్రశ్నిస్తూ భూమిని పోగొట్టుకున్న గిరిజనులు లేదా ఇతరులు దాఖలు చేసిన పిటీషనుపై లేదా స్వయంగా విచారణ అధికార్లే నోటీసులు జారీ చేసి విచారణ చేయవచ్చు.

2. జిల్లా కలెక్టరు / ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఐ.టి.డి.ఎ) / సబ్ కలెక్టర్ / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు భూమి బదలాయింపు కేసులు విచారణ చేసే అధికారం వుంటుంది.

3. విచారణకు ముందు 15 రోజుల గడువు నోటీసు జారీ చేస్తూ గిరిజనేతరుల సాగు వివరణను అధికారులు కోరవచ్చును. భూమి

బదలాయింపు నిబంధనలను అతిక్రమించి గిరిజనేతరులు సాగు చేస్తున్నారని విచారణలో తేలితే వారిని ఆ భూమి నుండి తొలగించి సంబంధిత గిరిజనులకు అప్పగించవచ్చును. లేదా సంబంధిత గిరిజనులు ఎవ్వరూ లేరని నిర్ధారణ అయినప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ భూమిని భూమి లేని గిరిజనులకు ఇవ్వవచ్చు.

4. అధికార్లు ఇచ్చిన ఉత్తర్వులను విభేదించు వారు ఉత్తర్వులు జారీ అయిన తేది నుండి రెండు నెలలులోగా జిల్లా కలెక్టరుకు లేదా ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారికి అప్పీలు చేసుకోవచ్చును. జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వ ఏజెంట్‌గా పిలుస్తారని తెలుసుకున్నాం. ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారిని "అదనపు ఏజెంట్"గా పిలుస్తారు.

5. జిల్లా కలెక్టర్ లేదా ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి ఇచ్చిన ఉత్తర్వులు విభేదిస్తే పునర్విచారణ చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని (గిరిజన సంక్షేమం) కోరవచ్చును.

6. ఈ నిబంధనల కింద జరుగు విచారణలో విచారణ అధికారుల అనుమతి లేనిదే న్యాయవాదులు ఈ కోర్టులలో వాదించడానికి వీలుండదు.

| భూమి బదలాయింపు కేసుల విచారణ కోర్టులు |
|---|
| ప్రభుత్వం (గిరిజన సంక్షేమం శాఖ)<br>(పునర్విచారణ)<br>↑<br>జిల్లా కలెక్టరు / ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి<br>(అప్పీళ్ళు)<br>↑<br>స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గిరిజన సంక్షేమం / సబ్ కలెక్టర్ /ఆర్.డి.ఓ<br>(ప్రాథమిక విచారణ) |

## 4. భూ బదలాయింపు (సవరణ) నిబంధనలు 1/70

ఈ నిబంధనలు 1/59 నిబంధనలను సవరించడం ద్వారా రూపొందించ బడ్డాయి. ఇవి 03-2-1970 నుండి అమలులోకి వచ్చాయి.

**ముఖ్యాంశాలు :**


1. గిరిజన, గిరిజనేతరుల మధ్య అలాగే గిరిజనేతరుల, గిరిజనేతరుల మధ్య జరిగే భూ బదలాయింపులు చెల్లవు.

**మీకు తెలుసా?**

**షెడ్యూల్డు ప్రాంతంలోగల ప్రభుత్వ భూమిని గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదని, ప్రభుత్వాన్ని కూడా 1/70 భూ నిబంధనల కింద గిరిజనేతరునిగానే భావించాలని 1997లో సమత మరియు మైనింగ్ కంపెనీకి మధ్య నడిచిన మైనింగు కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.**

2. భూ బదలాయింపు వివాదాల విచారణలో, తాను భూ బదలాయింపు నిబంధనలకు విరుద్ధంగా భూమిని పొందలేదని గిరిజనేతరుడే తనంతట తానుగా రుజువు చేసుకోవాల్సి వుంటుంది.
3. గిరిజనేతరులు తమ ఏజెన్సీ ప్రాంత భూమిని అమ్మాలనుకున్నప్పుడు, ఆ భూమిని గిరిజనులు కొనడానికి ముందుకు రానప్పుడు, ఆ భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల భూ పరిమితి చట్టం 1961 ప్రకారం ఆ భూమికి నష్టపరిహారం రూపంలో సంబంధిత గిరిజనేతరునకు సొమ్ము చెల్లించబడుతుంది.
4. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనేతరులు ఆస్థిని కూడగట్టుకునే అవకాశం లేదు.
5. కోర్టు డిక్రీ అమలు వలన జరిగే భూ క్రయ, విక్రయాలు అలాగే బినామీ పేర్లతో జరిగే ఎటువంటి గిరిజన భూ బదలాయింపులు చెల్లవు.

6. ఈ నిబంధనలు రాక పూర్వం గిరిజనేతరుల మధ్య జరిగిన భూమి బదలాయింపులు చెల్లుతాయి.




**మీకు తెలుసా?**


**1/70** నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుడు మరొక గిరిజనేతరుని వద్ద భూమి కొనుగోలు జేసే ఆ భూమిపై కొనుగోలుదారుడు మరియు అమ్మకందారుడు ఇద్దరూ ఆ భూమిపై హక్కు కోల్పోతారని రాష్ట్ర హైకోర్టు **1993**లో తీర్పు ఇచ్చింది.

## 5. భూ బదలాయింపులు (సవరణ) నిబంధనలు 1/71

**ముఖ్యాంశాలు :**

1. ప్రభుత్వం గుర్తింపు పొందిన సహకార సంఘాలకు, బ్యాంకులకు లేదా వాణిజ్య బ్యాంకులకు ఏజెన్సీ ప్రాంత స్థిరాస్తులను తనఖా పెట్టుకోవచ్చు. గిరిజనులు లేదా గిరిజనేతరులు ఋణ సదుపాయం పొందవచ్చును.

2. అప్పు తీర్చకపోతే తనఖా భూములను కోర్టు ద్వారా బ్యాంకులు అమ్మదలిస్తే వాటిని గిరిజనులతో మాత్రమే ఏర్పడ్డ సహకార సంఘాలకు లేదా గిరిజనులకు మాత్రమే అమ్మాలి.




## 6. భూ బదలాయింపు (సవరణ) నిబంధనలు 1/78

**ముఖ్యాంశాలు :**

1. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థిరాస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లపై ఆంక్షలు విధించబడింది. జిల్లా కలెక్టర్ అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్ లు చేయరాదు.
2. భూ నిబంధనలు అతిక్రమించి గిరిజనేతరులు భూములు సాగుచేస్తున్నా లేదా గిరిజనులకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించినా ఒక ఏడాది పాటు కఠిన కారాగార శిక్ష, లేదా రూ. 2,000/-లు జరిమానా లేదా రెండింటిని కోర్టు విధించవచ్చు.
3. ఈ రెగ్యూలేషన్ కింద నేరాలు గుర్తింపబడిన నేరాలుగా (కాగ్నిజబుల్) పరిగణించాలి. అంటే పోలీసులకు ఇచ్చిన పిర్యాదు పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలి.

# 6. అటవీ హక్కుల గుర్తింపు చట్టం

ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత గిరిజనుల భూమి హక్కులు గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు అటవీ భూమి హక్కు గురించి కూడా తెలుసుకుందాం. గిరిజనులు మరియు సంప్రదాయక అటవీ నివాసితుల (గిరిజనేతరులు) అటవీ హక్కును గుర్తింపు ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 రూపొందించింది. ఈ చట్టం షెడ్యూల్డు ప్రాంతాలకు మరియు మైదాన ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది.

చారిత్రకంగా అన్యాయానికి గురైన గిరిజనులు మరియు ఇతర సంప్రదాయక అటవీ నివాసితుల (గిరిజనేతరులు) అటవీ హక్కులు గుర్తించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. స్థూలంగా రెండు హక్కులు గుర్తించబడ్డాయి. ఒకటి వ్యక్తిగత పోడు భూమి హక్కు. మరొకటి ప్రజల ఉమ్మడి అటవీ వనరుల హక్కు. వాటితో పాటు సమిష్టి (ఉమ్మడి) అటవీ వనరుల నిర్వహణ హక్కు కూడా వుంది. ఈ చట్టం 31-12-2007న అమలులోకి వచ్చింది. ఈ చట్టం కింద రూపొందించిన నియమాలు 01-01-2008 నుండి అమలులోనికి వచ్చాయి.

చట్టం గుర్తించిన అటవీ హక్కులు క్లుప్తంగా తెలుసుకుందాం. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు మరియు ఇతర సంప్రదాయక అటవీ నివాసితుల పోడు భూమి హక్కు. అయితే షెడ్యూల్డు ప్రాంతంలో గిరిజనేతరులకు పోడు భూమి హక్కు ఇవ్వడానికి ఇంతకు ముందు మనం తెలుసుకున్న షెడ్యూల్డు ప్రాంత భూమి నిబంధనలు అనుమతించవు.

పోడు భూమి హక్కుతో పాటు సమిష్టి అటవీ వనరుల వినియోగపు హక్కు, అటవీ ప్రాంతాల్లో లభించే చిన్న తరహా అటవీ ఉత్పత్తుల (తేనె, మైనం, లక్క, బీడీ ఆకులు, వేర్లు, దుంపలు మున్నగు) సేకరణ, వినియోగం, రవాణా, అమ్ముకొనే హక్కు.



అటవీ ప్రాంత జలాశయాల్లో చేపలు పట్టుకొనే హక్కు, అటవీ ప్రాంతాల్లో పశువులను మేపుకొనే హక్కు. సమస్యాత్మక గిరిజనుల (పి.వి.టి.జీ) ఆవాస హక్కు. అటవీ భూములతో ముడిపడి వున్న పి.వి.టి.జీ / పురాతన వ్యవసాయదారుల జీవనోపాధి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక ఆచరణ కూడా ఆవాస హక్కులో భాగం.

అటవీ గ్రామాలను ఇప్పటికీ సర్వే కాని అటవీ గ్రామాలను రెవిన్యూ గ్రామాలుగా మార్చుకొనే అవకాశం ఈ చట్టం కల్పిస్తుంది. వివాదాస్పద అటవీ భూములపై కూడా అటవి  హక్కు గుర్తింపు పొందే హక్కు. ప్రాజెక్టుల కోసం గిరిజనులను వారి భూముల నుండి తొలగిస్తే, వారు గత ఐదు సంవత్సరాల నుండి ఆ భూమిని వినియోగించలేదని రుజువు చేస్తే, ఆ భూములపై వారికి పునరావాస హక్కు, ప్రత్యామ్నాయ భూమి కోరే హక్కు.

గతంలో అటవీ భూముల సాగు కొరకు ప్రభుత్వం మంజూరు జేసిన పట్టాలు, ఇతరత్రా జారీ జేసిన ఉత్తర్వులకు చెందిన అటవీ భూములపై కూడా హక్కు పత్రాలు పొందే అవకాశం వుంది. సర్వే కాబడని అటవీ గ్రామ ఆవాసాలను గ్రామ సభ తీర్మానాల ఆధారంగా రెవిన్యూ గ్రామాలుగా మార్చుకొనే హక్కు.

| | |
|---|---|
| వ్యక్తిగత అటవీ భూమి (పోడు) హక్కు | అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు సంప్రదాయక అటవీ నివాసితులకు పోడు పట్టాలు పొందే హక్కు |
| **సమిష్టి (ఉమ్మడి) అటవీ హక్కులు** | 1) చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, వినియోగం రవాణా మరియు అమ్మకపు హక్కు<br>2) నీటి వనరులలో చేపలు పట్టుకునే హక్కు<br>3) పశువుల మేత ప్రదేశాలపై హక్కు<br>4) సంప్రదాయ ప్రదేశాలు, చెట్లు, బాట హక్కు<br>5) సమస్యాత్మక గిరిజనుల (పి.వి.టి.జీ) / పురాతన వ్యవసాయదార్ల ఆవాస హక్కు<br>6) అభివృద్ధి పొందే హక్కు<br>7) అటవీ గ్రామాలను / సర్వే కాని గ్రామాలను రెవిన్యూ గ్రామాలుగా మార్చుకొనే హక్కు<br>8) అటవీ భూమి కోల్పోయిన విషయంలో పునరావాసం/ప్రత్యామ్నాయ భూమి కోరే హక్కు<br>9) అటవీ వనరులతో ముడిపడివున్న సాంప్ర దాయ విజ్ఞానం, జీవ వైవిధ్యం, మేథోసంపత్తి కాపాడుకొనే హక్కు |
| **సమిష్టి (ఉమ్మడి) అటవీ వనరుల నిర్వహణ హక్కు** | అటవీ వనరుల పరిరక్షణ, పునరుద్ధరణ, నిర్వహణ హక్కు అటవీ హక్కుల నిర్వహణ కోసం గ్రామ సభ ఒక కమిటీని కూడా నియమించవచ్చు. |

జాతీయ పార్కులు, అభయారణ్యాలలో నివశిస్తున్న గిరిజనుల అటవీ హక్కులు కూడా నిర్ధారణ చేసి పట్టాలు మంజూరు చేయాలి. అయితే ప్రత్యేక వన్యప్రాణి సంరక్షణ కోసం గిరిజనులు వారి ఆవాసాల నుండి ఖాళీ చేయాలంటే గిరిజనుల ఆవాసాల వలన వన్యప్రాణికి ముప్పు వున్నదని స్పష్టమైన నివేదిక వుండాలి. గిరిజనులకు పునరావాసం కల్పించాలంటే, పునరావాస పథకాల అమలుకు ముందుగా గ్రామసభ అనుమతి తీసుకోవాలి. గ్రామసభ సమ్మతించిన పథకాలు పూర్తిగా అమలు చేసేంత వరకు గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించ కూడదు. అయితే అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట నిషేధించబడింది.

## అభివృద్ధి పొందే హక్కు :

ఒక హెక్టార్ అటవీ భూమిలో 75 చెట్లుకు మించి తొలగించకుండా గ్రామ సభ అనుమతితో ఆ అటవీ భూమిలో గ్రామ అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అంటే స్కూల్స్, ఆసుపత్రి, అంగన్‌వాడి, విద్యుత్, టెలిఫోన్, చెరువులు, మంచినీటి సదుపాయం, రహదార్ల వంటి మౌలిక అవసరాల కోసం అటవీ భూమిని వినియోగించవచ్చును.

## అటవీ భూమి హక్కు పొందడానికి అర్హత :

అటవీ భూమి హక్కు పత్రాలు పొందాలంటే, 2005 డిసెంబరు 13 నాటికే అటవీ భూముల వినియోగం వుందని చెప్పడానికి గిరిజనులు తగిన రుజువు చూపాలి. అయితే ఇతర సంప్రదాయక అటవీ నివాసితులు మూడు తరాలుగా ఆ అటవీ భూమి వారి వినియోగంలో వుందని తగిన రుజువు చూపాలి. తరము అంటే 25 సంవత్సరాలు.

హక్కు పత్రాలు భార్య, భర్త ఇరువురి పేర ఇవ్వబడతాయి. ఈ భూమి వారసత్వ ఆస్తిగా వుంటుంది. వారసులు లేనప్పుడు, సమీప బంధువులకు ఆ హక్కు లభిస్తుంది. గరిష్టంగా పది ఎకరాల వరకు మాత్రమే పోడు భూమి హక్కు కోరడానికి వీలుంటుంది. అయితే ప్రజల ఉమ్మడి అటవీ హక్కుల పత్రాలు గ్రామం పేర మంజూరు జేస్తారు.

## అటవీ భూముల నిర్వహణ మరియు సంరక్షణ బాధ్యత ఏమిటి :

అడవుల వినియోగంతో పాటు సంరక్షణ వంటి కొన్ని బాధ్యతలు వుంటాయి. అవి 1) జీవ వైవిధ్యాన్ని కాపాడటం, 2. జీవావరణ ప్రాంతాల పరిరక్షణ, 3) ప్రజల ఆవాసాలను వారి సాంస్కృతిక, వారసత్వం కాపాడుకోవడం, 4) జీవ వైవిధ్యం దెబ్బతినకుండా కాపాడటంలో గ్రామ సభలు చురుకుగా వ్యవహరించేలా చూడటం.

## అటవీ భూముల పరిధిలోనికి వచ్చే భూములు :

నేటి వరకు అటవీ భూములుగా వర్గీకరించని భూములు, సరిహద్దులు గుర్తించని అడవులు, రక్షిత అడవులు, రిజర్వుడు అడవులు, అభయారణ్యాలు, జాతీయ పార్కులులో వుండే అటవీ భూములు ఈ చట్టం పరిధిలోనికి వస్తాయి. అంటే ఈ అటవీ భూముల్లో హక్కులు గుర్తించడానికి వీలుంటుంది.

**మీకు తెలుసా?**

**అటవీ భూమిని అటవేతర ప్రయోజనాలకు ప్రభుత్వం (ఉదాహరణకు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం) వినియోగించాలంటే ఆ అటవీ భూమిపై అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద గిరిజనుల లేదా సంప్రదాయక అటవీ నివాసితులు హక్కులు గుర్తింపు ముందుగా చేపట్టాలి. హక్కుల గుర్తింపు అయిన తర్వాతనే ఆ అటవీ భూమిని ప్రభుత్వం వినియోగించాలి.**

## అటవీ హక్కుల నిర్ధారణ కమిటీలు :

అటవీ హక్కుల నిర్ధారణ మూడు స్థాయిలలో జరుగుతుంది. అయితే అంతిమంగా జిల్లా స్థాయి నిర్ధారణతోనే హక్కు పత్రాలు మంజూరు కాబడతాయి అవి.

1. గ్రామసభ, 2. సబ్ డివిజినల్ కమిటీ, 3. జిల్లా స్థాయి కమిటీ. అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలుకు తగిన మార్గ దర్శకాలు జారీ చేసేందుకు రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర పర్యవేక్షక కమిటీ కూడా వుంటుంది.

## గ్రామ సభ :

షెడ్యూల్డు ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రకటించిన గ్రామాలకే గ్రామ సభ వుంటుంది. కాగా మైదాన ప్రాంతాల్లో గ్రామ పంచాయితీ స్థాయిలో గ్రామ సభ ఉంటుంది. ఇటువంటి గ్రామ సభలకు 10 నుండి 15 మందితో కూడిన 'అటవీ హక్కుల కమిటీ' ని ఏర్పాటు జేసే అధికారం గ్రామ సభకు ఉంటుంది. అటవీ హక్కుల కమిటీకి అధ్యక్షుడు మరియు కార్యదర్శి వుంటారు.

**అటవీ హక్కుల కమిటీ బాధ్యతలు :**

గ్రామ సభల సూచన మేరకు అటవీ హక్కుల కోరే వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరణ, సంబంధించిన రుజువులు సేకరణ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిపై తీర్మానం కోసం గ్రామ సభ ముందు వుంచడం అటవీ హక్కుల కమిటీ ప్రధాన బాధ్యత. దరఖాస్తుకు సంబంధించిన మ్యాపులు, రికార్డులు తయారుచేయడం, అవసరమగు వాంగ్మూలాలను, రికార్డులను స్వీకరించడం, వాటిని దరఖాస్తుదారుల సమక్షంలో పరిశీలించడం.

సరిహద్దు వివాదాలపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత గ్రామ సభలకు నివేదించడం. గ్రామ సభలు పరిష్కరించలేని సమస్యలను సబ్ డివిజినల్ కమిటీకి తీర్మానాల నిమిత్తం పంపడం. కమిటీలకు, గ్రామస్తులకు కావలసిన సమాచారాన్ని, రికార్డులను కావలసిన వారికి అందజేయడం.

## 1) గ్రామ సభ విధులు :

స్వీకరించిన దరఖాస్తులపై విచారణ చేసి హక్కుల నిర్ధారిస్తూ తీర్మానం చేయడం, వాటిని సబ్ డివిజినల్ కమిటీకి పంపడం. దరఖాస్తుదార్ల జాబితా రిజిష్టరు నిర్వహణ, జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం.

అటవీ హక్కులు కోరే వారి నుండీ అర్జీలు ఆహ్వానించిన తేదీ నుండి మూడు నెలల వరకూ అర్జీలను స్వీకరిస్తాయి. అవసరమైతే కాలాన్ని

పోడిగించవచ్చు. ఉమ్మడి అటవీ హక్కుల నిర్ధారణకు ఆయా గ్రామ సభలకు, మరియు సబ్ డివిజినల్ కమిటీలకు సమాచారాన్ని తెలియజేస్తుంది. గ్రామ సభ తీర్మానాలతో విభేదించే వారు 60 రోజుల్లో సబ్ డివిజినల్ కమిటీకి అప్పీల్ చేసుకోవచ్చు.



## 2) సబ్ డివిజినల్ కమిటీ :

సబ్ కలెక్టరు అధ్యక్షతన, ఐ.టి.డి.ఏ ప్రాంతాల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి / ఐ.టి.డి.ఏ లేని ప్రాంతాల్లో సహాయ గిరిజన సంక్షేమ అధికారి మెంబర్ సెక్రటరీగా వుంటూ జిల్లా పరిషత్ నియమించిన ముగ్గురు మండల ప్రజా పరిషత్ సభ్యులు (ఎం.పి.టి.సి)తో సబ్ డివిజినల్ కమిటీ ఏర్పడుతుంది.

## సబ్ డివిజినల్ కమిటీ విధులు :

అటవీ హక్కుల సమాచారాన్ని, గ్రామ సభలకు, అటవీ హక్కుల కమిటీలకు చేరవేయడం. అడవులు, రెవిన్యూ గ్రామాల మ్యాపులు, అటవీ హక్కుల కమిటీలకు

అందజేయడం. గ్రామ సభల తీర్మానాలను సంకలనం చేయడం. గ్రామ సభల తీర్మానాల మ్యాపుల వాస్తవికతను పరిశీలించడం.

గ్రామ సభ తీర్మానాలు విభేదించే పిటీషన్ల (అప్పీళ్ళు) పై విచారణ చేయడం, తీర్పులు ఇవ్వడం, ఇతర సబ్ డివిజినల్ కమిటీలతో సమన్వయంతో మెలగడం, హక్కుల గుర్తింపు ముసాయిదా రికార్డులను రూపొందించి జిల్లా స్థాయి కమిటీలకు పంపడం.

సబ్ డివిజినల్ కమిటీ తీర్మానాలతో విభేదించే వారు 60 రోజుల్లో జిల్లా స్థాయి కమిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. గ్రామ సభ తీర్మానాన్ని అనుమతించడం లేదా తిరస్కరించడం లేదా పునర్విచారణ కోసం గ్రామ సభకు పంపవచ్చు.

## 3) జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు :

జిల్లా కలెక్టరు అధ్యక్షతన, ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి, లేదా గిరిజన సంక్షేమ అధికారి మెంబర్ సెక్రటరీగా వుంటూ, ముగ్గురు జిల్లా పరిషత్ సభ్యులు (జెడ్.పి.టి.సి) మరియు జిల్లా అటవీ శాఖాధికారి సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పడుతుంది.

## జిల్లా స్థాయి కమిటీ విధులు :

సబ్ డివిజినల్ కమిటీ అటవీ హక్కుల తీర్మానాల ముసాయిదాలపై తుది నిర్ణయాలు తీసుకోవడం. సబ్ డివిజినల్ కమిటీ తీర్మానాన్ని అనుమతించడం లేదా తిరస్కరించడం లేదా పునర్విచారణ కోసం సబ్ డివిజినల్ కమిటీకి పంపవచ్చు. సబ్ డివిజినల్ కమిటీ నిర్ణయాల పై పిటీషన్లు (అప్పీళ్ళు) స్వీకరించడం, ఇతర జిల్లా కమిటీలతో సమన్వయంగా ఉండటం. ప్రభుత్వ రికార్డులలో అటవీ హక్కుల నమోదుకై తగు ఆదేశాలు జారీ చేయడం, నిర్ధారించిన అటవీ హక్కులను ప్రచురించడం, అటవీ హక్కుల పత్రాలను జారీ చేయడం.

**అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియ**

జిల్లా స్థాయి కమిటీ (అప్పీళ్ళు)

↑

సబ్ డివిజినల్ కమిటీ (అప్పీళ్ళు)

↑

గ్రామ సభ (ప్రాధమిక విచారణ)

↑

అటవీ హక్కుల కమిటీ

## పోడు భూమి హక్కుకు కావలసిన సాక్ష్యాలు :

గిరిజనులు లేదా ఇతర సంప్రదాయ అటవీ నివాసితులు తమ వ్యక్తిగత అటవీ భూమి హక్కుల కోసం అర్జీలు సమర్పించినప్పుడు, వాటితో పాటు ఒకటి కంటే ఎక్కువ సాక్ష్యాలు సమర్పించాలి. అవి ఈ క్రింది వానిలో ఏవైనా కావచ్చు.

ప్రభుత్వ రికార్డులు, రాజపత్రాలు, జనాభా లెక్కలు, సర్వే రికార్డులు, మ్యాపులు, ఉపగ్రహ చిత్రాలు, అటవీ విచారణ నివేదికలు, అటవీశాఖ రికార్డులు, పట్టాలు, కౌలు (లీజు) కాగితాలు, ప్రభుత్వ కమిటీ నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు ప్రభుత్వ ప్రకటనలు, తీర్మానాలు, ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, ఇంటిపన్ను చెల్లింపు రశీదులు, నివాస ధృవీకరణ పత్రాలు, ఇల్లు, గుడిసెలు, చెక్ డ్యాంలు, కోర్టు తీర్పులు, ప్రభుత్వ సర్వే సంస్థలు రూపొందించిన పత్రాలు, రాచరిక వ్యవస్థ కాలంలో రూపొందించిన మ్యాపులు, రికార్డులు, రాయితీలు, మినహాయింపులు, పురాతన నిర్మాణాలు, బావులు, శ్మశాన వాటికలు, పవిత్ర స్థలాలు, వంశవృక్ష వివరాలు, గతంలో గ్రామ నివాసిగా వున్నప్పటి ఆధారాలు, పెద్దల వ్రాత పూర్వక వాంగ్మూలాలు మొదలైనవి.

## సమిష్టి అటవీ హక్కుల నిర్ధారణకు కావలసిన సాక్ష్యాలు :

సాంప్రదాయ పశువుల మేత ప్రదేశాలు, వేర్లు, దుంపలు, పశుగ్రాసం, ఫలాలు, ఇంకా అనేక చిన్న తరహా అటవీ ఉత్పత్తులు సేకరణ మరియు వినియోగం, చేపల వేట స్థలాలు, నీటిపారుదుల నిర్మాణాలు, నీటి వనరులు, వన మూలికలు గల ప్రదేశాలు, పురాతన నిర్మాణాలు, శిధిల నిర్మాణాలు, పవిత్ర వృక్షాలు, తోపులు, చెరువులు, నదీ ప్రాంతాలు, శ్మశాన వాటికలు మొదలైనవి.

## అటవీ హక్కులు ఎలా పొందగలం :

మొదటిగా అటవీ హక్కుల కోసం సరైన సాక్ష్యాలతో గ్రామ సభకు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ సభ తీర్మానంతో ఏకీభవించని వారు, 60 రోజుల్లో సబ్ డివిజినల్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. సబ్ డివిజినల్ కమిటీ బహిరంగంగా విచారిస్తుంది. 15 రోజుల ముందే సమాచారాన్ని గ్రామ సభకు, అర్జీదారునకు నోటీసు ద్వారా తెలియజేస్తుంది.

ఒకవేళ సబ్ డివిజినల్ కమిటీ, హక్కును ఆమోదించకపోతే పునర్విచారణ కోసం తిరిగి గ్రామ సభకు పంపుతుంది. పున:పరిశీలనకు వచ్చిన అర్జీలను మరలా గ్రామసభ 30 రోజుల్లో ఆమోదిస్తే అక్కడితో సమస్య పరిష్కారమవుతుంది. ఒకవేళ గ్రామ సభ అర్జీని తిరస్కరిస్తూ గ్రామసభ తీర్మానం పంపితే, ఆ తీర్మానాన్ని సబ్ డివిజినల్ కమిటీ ఆమోదించవచ్చు. లేదా తిరస్కరించవచ్చు. హక్కుల అర్జీల విషయంలో గ్రామ సభల మధ్య వివాదాలు వుంటే వాటిని సమావేశాల ద్వారా పరిష్కరిస్తుంది.

అంగీకారం కుదరకపోతే తానే నిర్ణయం వెలువరిస్తుంది. సబ్ డివిజినల్ కమిటీ స్థాయిలో పరిష్కారమవ్వకపోతే, అర్జీదారుడు జిల్లా స్థాయి కమిటీలకు 60 రోజుల్లోగా అర్జీ చేసుకోవచ్చు. జిల్లా స్థాయి కమిటీ బహరంగంగా విచారిస్తుంది. 15 రోజుల ముందే సమాచారాన్ని గ్రామ సభకు, అర్జీదారునకు నోటీసు ద్వారా తెలియజేస్తుంది. ఒకవేళ జిల్లా స్థాయి కమిటీ హక్కును

ఆమోదించకపోతే, పునర్విచారణ కోసం తిరిగి సబ్ డివిజినల్ కమిటీకి పంపుతుంది.

సబ్ డివిజినల్ కమిటీ వెలువరించిన నిర్ణయాన్ని జిల్లా కమిటీ ఆమోదించవచ్చు. లేదా తిరస్కరించవచ్చు. సబ్ డివిజినల్ కమిటీల మధ్య వివాదాలు వుంటే వాటిని సమావేశాల ద్వారా పరిష్కరిస్తుంది. అంగీకారం కుదరకపోతే తానే నిర్ణయం వెలువరిస్తుంది. ఆ తదుపరి హక్కులకు సంబంధించిన ప్రభుత్వ రికార్డులతో జిల్లా కలెక్టరు హక్కుల నమోదు కోసం పంపుతుంది.

## అటవీ హక్కుల దరఖాస్తుకు గల కాలపరిమితి :

అటవీ హక్కుల దరఖాస్తుకు గ్రామ సభ ప్రకటన ఇచ్చిన తేదీ నుండి 3 నెలల వరకు అర్జీలు పెట్టుకోవచ్చు. ఈ కాలాన్ని గ్రామ సభ పొడిగించవచ్చు.

## జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ నిర్ణయాలపై అప్పీలు :

జిల్లాస్థాయి అటవీ హక్కుల కమిటీ నిర్ణయమే తుది నిర్ణయము. దీనిపై అప్పీలు దాఖలు చేసుకొనేందుకు వీలులేదు. అయితే ఈ కమిటీ చట్టవ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే, వాటిపై రాష్ట్ర హైకోర్టు లేదా సుప్రీం కోర్టులలో రిట్ పిటీషన్లు వేయవచ్చు.

## నేరాలు / జరిమానా :

అటవీ హక్కుల గుర్తింపు చట్టం అతిక్రమించి గిరిజనుల అటవీ హక్కులు కాలరాసిన అధికార్లు / కమిటీలు, ఒక వెయ్యి రూపాయలు వరకు జరిమానాకు బాధ్యులు. ఆ అధికారి / కమిటీ తనకు తెలియకుండగానే హక్కుల ఉల్లంఘన జరిగిందనీ, లేదా ఎటువంటి అతిక్రమణ జరగకుండా సజావుగా వ్యవహరించానని రుజువు చేయాల్సి వుంటుంది.

గ్రామసభ తీర్మానాన్ని విబేధించే గిరిజనులు లేదా గ్రామసభ ఆ ఉల్లంఘనల విషయమై ఉన్నత అధికారి పై చర్య తీసుకోవాలని కోరే ముందుగా 60 రోజుల

నోటీసు రాష్ట్ర పర్యవేక్షణ కమిటీకి ఇవ్వాలి. మరియు ఆ కమిటీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని భావించినప్పుడు మాత్రమే కోర్టు ఆ అధికారి పై విచారణ చేపడుతుంది.

### మీకు తెలుసా?

1) కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నప్పటికీ, మిగతా వారు అటవీ హక్కులను కోల్పోరు. వారు పూర్తిగా అటవీ భూముల పైనే ఆధారపడి జీవించాలనే నియమం కూడా లేదు.

2) గిరిజనులు తమ నివాస ప్రాంతాన్ని మార్చినప్పుడు కూడా అటవీ హక్కులు కోల్పోరు.

3) అటవీ హక్కులు వ్యక్తిగతంగా లేదా ప్రజా కమతాలుగా లేదా రెండిటి పేరు మీద కూడా ఇవ్వవచ్చు.

4) గుర్తించబడిన అటవీ హక్కులకు సంబంధించిన అటవీ ఫలసాయాన్ని రవాణా చేసేందుకు పర్మిట్లు అయా గ్రామ సభలే ఇవ్వాలి.

5) కమ్యూనిటీ అటవీ హక్కుల పత్రాలను గ్రామ సభ పేర మంజూరు చేయబడతాయి.

6) అటవీ భూములను ప్రాజెక్టులకు మళ్ళించాలంటే గ్రామ సభ అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేసినట్లు ధృవీకరణ చేయాలి. భూముల మళ్ళింపుకు అవి తీర్మానాలు చేయాలి.

7) అటవీ హక్కు కోరుతూ పెట్టుకున్న దరఖాస్తుపై అంతిమ నిర్ణయం వెలువడే వరకూ దరఖాస్తుదారుని ఆ అటవీ భూమి నుంచి తొలగించరాదు.

8) అటవీ హక్కులు నిరాకరించిన కమిటీలు లేదా గ్రామ సభ తగిన కారణాలు దరఖాస్తు దారునకు తెలియజేయాలి.

# 7. షెడ్యూల్డు ప్రాంత స్థానిక సంస్థలు - "పెసా" చట్టం

గ్రామ సభల ద్వారా షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనుల స్వయం పాలన జరుపుకోవడానికి వీలుగా 1996లో భారత ప్రభుత్వం "షెడ్యూల్డు ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ చట్టం" రూపొందించింది. దీనినే సంక్షిప్తంగా "పెసా" చట్టం అంటారు.

మన రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాల్లో "పెసా" చట్టాన్ని అమలు పరిచేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994కు 1998లో సవరణ జేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించింది. చట్టం సమగ్రంగా అమలు పరిచేందుకు "పెసా" నియమాలు 2011లో తీసుకువచ్చింది.

గ్రామ పరిపాలనకు వీలుగా షెడ్యూల్డు ప్రాంత గ్రామాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. గ్రామాలు ప్రకటించే అధికారం రాష్ట్ర గిరిజన సంక్షేమ కమీషనర్‌కు వుంటుంది. అలా ప్రకటించిన ప్రతీ గ్రామానికి ఒక గ్రామ సభ వుంటుంది. గ్రామ పంచాయితీలో ఇటువంటి గ్రామాలు ఒకటి నుండి ఎన్నైనా వుండవచ్చును.

"పెసా" చట్టం కింద గ్రామ సభలతో పాటు ఇతర పంచాయతీ రాజ్ సంస్థల స్థానిక పరిపాలన అధికారాలు, బాధ్యతలు గురించి మనం వివరంగా తెలుసుకోవలసి వున్నది. పంచాయితీ రాజ్ సంస్థలు అంటే గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు మరియు జిల్లా పరిషత్‌లు అని అర్థం. మనం ముందుగా గ్రామ సభలు నిర్వహణ, అధికారాలు గురించి తెలుసుకుందాం.

**మీకు తెలుసా?**

పెసా (PESA) అంటే THE PROVISIONS OF THE PANCHAYATS (EXTENSION TO SCHEDULED AREAS) ACT - షెడ్యూల్డు ప్రాంత పంచాయితీ రాజ్ విస్తరణ చట్టం అని అర్థం. ఇది మొదటగా 1996లో భారత ప్రభుత్వంచే చేయబడింది.

## మీకు తెలుసా?

పెసా చట్టం వర్తించే రాష్ట్రాలు : ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, హిమచల్‌ప్రదేశ్, ఝూర్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, రాజస్తాన్, తెలంగాణ, కేవలం షెడ్యూలు ప్రాంతాలకే వర్తిస్తుంది.

## గ్రామ సభల నిర్వహణ మరియు అధికారాలు

### 1) గ్రామ సభ, దాని విధులు :

గ్రామస్థాయిలో ఓటర్ల జాబితాలో పేర్కొనబడిన వ్యక్తులతో కూడినదే "గ్రామసభ" ప్రభుత్వం ప్రకటించిన ప్రతీ గ్రామానికి ఒక గ్రామ సభ వుంటుంది.

గ్రామ పంచాయతీ సర్పంచి గ్రామ సభకు అధ్యక్షులుగా వుంటారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా గ్రామ సభ ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని గ్రామ సభ సభ్యులు ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలు షెడ్యూల్డు తెగకు చెందిన వారై వుండాలి. వారి పదవీకాలం 5 సంవత్సరాలు.



గ్రామ సభ

గ్రామ సభ సభ్యులలో 1/3వ వంతు కంటే తక్కువగా కాకుండా హాజరై అందులో కనీసం 50 శాతం మంది ఎస్.టి. సభ్యులు హాజరును గ్రామసభ సమావేశానికి "కోరం"గా పరిగణిస్తారు.

ఏడాదిలో కనీసం రెండుసార్లు గ్రామసభ సమావేశాలు నిర్వహించాలి. అయితే వీటికి అదనంగా నిర్ణయించిన ప్రదేశం, సమయంలో అవసరమైనప్పుడు గ్రామ సభ సమావేశాలు ఎన్నైనా ఏర్పర్చుకోవచ్చు. సమావేశపు హాజరు పట్టీలో సమావేశానికి అధ్యక్షత వహించే సభ్యులు గ్రామ సభకు హాజరైన సభ్యులందరి నుంచి సంతకాలను లేదా వేలిముద్రలను తీసుకోవాలి.

గ్రామ సభ సమావేశం అనంతరం గ్రామసభ నిర్ణయాలను నిర్వహణ అధికారి చదివి వినిపించి, సభ్యుల ఆమోదం పొందాలి. ప్రతీ తీర్మానపు అంశాన్ని ప్రత్యేకంగా వ్రాసి ఆమోదించడం లేదా ఇతరత్రా వాటితో గ్రామసభ ఆమోదం పొందాలి.

సభ్యులు తమ ఆమోదాన్ని చేతులు ఎత్తడం ద్వారా తెలియజేయాలి. సమావేశాలలో ఆమోదించిన గ్రామ సభ తీర్మానాలను ఒక రిజిస్టరులో నమోదు చేసుకోవాలి.

### మీకు తెలుసా?

**గ్రామ సభలలో చర్చించినది ఒకటయితే, తీర్మానం కాగితం మరొకటి తయారుచేయవచ్చు. కనుక జాగ్రత్త వహించాలి.**

గ్రామసభ కార్యదర్శి / ఉపాధ్యక్షుడు సందర్భాన్ని బట్టి సభ్యుల సంతకం / వేలిముద్రలను తీసుకోవాలి. ఈ తీర్మానాలను నాలుగు వారాలలోపు గ్రామ సభ కార్యదర్శి సంబంధిత ప్రభుత్వ శాఖలకు / సంస్థలకు పంపాలి.

### మీకు తెలుసా?

**గ్రామ సభలు జరగకుండానే జరిగినట్లు వేలిముద్రలు, సంతకాలు తీసుకొని మోసం చేయవచ్చు. కనుక జాగ్రత్త పడాలి.**

ఈ క్రింది అంశాలపై నిర్ణయాల కోసం గ్రామ సభ ముందుంచాలి.

**గ్రామ సభ**

- గ్రామ వ్యవసాయ ఉత్పాదక ప్రణాళికలు
- గ్రామాలలో వున్న ఊరు ఉమ్మడి భూములు జాబితా, అంటే పంచాయతీకి చెందిన పోరంబోకు భూములు మరియు ఇతర సంబంధిత వివరాలు
- ఇంటి, ఇతర స్థిరాస్థుల యాజమాన్యాల బదలాయింపులు
- గ్రామ పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ అంచనాల ప్రతి
- పంచాయతీ లెక్కల ఆడిట్ నివేదిక ప్రతి
- గ్రామ పంచాయతీకి రావలసిన పన్నులు, రుసుముల బకాయిలు వున్న బకాయిదారుల జాబితా
- చౌక ధర దుకాణం / డి.ఆర్.డి.వో. పనితీరు
- అంగన్ వాడీ పనితీరు
- ఆరోగ్య సబ్ సెంటర్స్ పనితీరు
- పాఠశాలల పనితీరు
- సంక్షేమ హాస్టళ్ళ పనితీరు
- త్రాగునీటి సౌకర్యం
- విద్యుత్ సౌకర్యం
- ఇతర అభివృద్ధి కార్యక్రమాలు

## మరిన్ని గ్రామ సభ బాధ్యతలు మరియు అధికారాలు

### గ్రామ అభివృద్ధి పథకాలు :

గ్రామస్థాయిలో పంచాయితీ చేపట్టే సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధి పథకాల అమలుకు గ్రామసభ నుండి ముందుగా అనుమతి పొందాలి. పేదరిక నిర్మూలనా పథకం మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల కింద లబ్ధిదారుల గుర్తింపు మరియు ఎంపిక చేసే బాధ్యత గ్రామసభకు వుంటుంది.

అభివృద్ధి పథకాల ప్రణాళిక కింద గ్రామ పంచాయితీలు ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవీకరణ పత్రం ఆయా గ్రామ సభల నుండి పొందాలి. జనావాస ప్రాంతాలలో వ్యక్తిగత / సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించడం, వాటిని అమలు చేయడంలో గ్రామ సభను భాగస్థులుగా చేయాలి.

గ్రామసభకు విడుదల చేసిన నిధుల విషయంలో సంబంధిత సంస్థ / ప్రభుత్వ శాఖకు నిధుల వినియోగ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.

**మీకు తెలుసా?**

**గ్రామ సభ నిధులను వినియోగించకుండానే నిధుల వినియోగ ధృవీకరణ పత్రాన్ని సమర్పించవచ్చును. కనుక జాగ్రత్త వహించాలి.**

### మహిళా, శిశు సంక్షేమం :

అంగన్‌వాడి కేంద్రాల బడ్జెట్‌ను గ్రామ సభ ఆమోదించాలి.

### సమస్యల పరిష్కారం :

ప్రస్తుతం అమలులో గల చట్టాలకు, సంప్రదాయబద్ధ వివాద పరిష్కార పద్ధతులకు భిన్నంగా కాకుండా ప్రజల ఆచార సంప్రదాయాలు పరిరక్షించేందుకు గ్రామసభకు అధికారం వుంటుంది.

## చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ :

గ్రామ పరిధిలో ఉన్న చిన్న తరహా నీటి వనరులను ఆ గ్రామ జనాభా సమిష్ఠి ప్రయోజనాల కోసం ప్రణాళిక మరియు నిర్వహణా బాధ్యత గ్రామ సభపై వుంటుంది. "చిన్న తరహా నీటి వనరులు" అంటే త్రాగునీటికి ఉపయోగించే సహజనీటి నిల్వలు, 40 హెక్టార్ల వరకు సాగు కోసం ఉపయోగించిన చెక్ డ్యాములు నిర్మాణం ద్వారా నిల్వ చేసే నీటి వనరులు అని అర్థం.

## చిన్న తరహా, అటవీ ఉత్పత్తుల నిర్వహణ :

చిన్న తరహా అటవీ ఫలసాయంపై యాజమాన్యపు హక్కు వుంటుంది. జనావాసాలలో చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సంప్రదాయక సేకరణ, యాజమాన్యం, వినియోగం సంబంధించిన హద్దుల విషయంలో వివాదాలు తలెత్తినప్పుడు సేకరణదారులు పరిష్కారం కోసం గ్రామసభకు తెలియపరచాలి. అటవీ హక్కుల గుర్తింపు చట్టంలో అటవీ హక్కులు మరియు గ్రామసభ విధులు, హక్కులు గురించి వివరంగా తెలుసుకున్నాం.



## మద్యపాన నిషేధం అమలు :

మద్యపాన నిషేధం అమలు లేదా వినియోగ క్రమబద్ధీకరణ లేదా అమ్మకాలపై ఆంక్షలు విధించే అధికారం గ్రామ సభకు వుంటుంది. అంటే గ్రామంలో మద్యం ఉత్పత్తి లేదా తయారీ కేంద్రాల ఏర్పాటు విషయంలో అలాగే మద్యం దుకాణాల / బార్ లైసెన్సులు విషయంలో గ్రామసభ తీర్మానం మేరకే ఎక్సైజ్ శాఖ నిర్ణయం వుండాలి. గిరిజనుల వివాహాలు, ఇతర సామాజిక వేడుకలో సంప్రదాయ మద్యం ఉత్పత్తి మరియు సేవించే విషయంలో కూడా గ్రామసభ నిర్ణయం అవసరం.

## గిరిజనుల భూమి హక్కుల పరిరక్షణ :

గిరిజనుల భూమి పరాయీకరణ ఒక సమస్య. షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజన భూమి బదలాయింపు నిబంధనలు గురించి తెలుసుకున్నాం. షెడ్యూల్డు ప్రాంతాలలోని గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం మరియు అన్యాక్రాంతం కాబడిన గిరిజనుల భూమిని తిరిగి ఇప్పించే అధికారం గ్రామసభకు వుంటుంది.

## అప్పీలు, పునర్విచారణ సమీక్షాధికారం :

గ్రామసభ తీర్మానాన్ని విబేధించే వ్యక్తి లేదా సంస్థ తీర్మానం ఆమోదం పొందిన 60 రోజుల్లోగా గిరిజన సంక్షేమ కమీషనరుకు అప్పీలు చేసుకోవచ్చు. గ్రామసభ నిర్ణయాల వాస్తవికత లేదా చట్టబద్ధత గురించి విచారణ జరిపి, గిరిజనుల ప్రయోజనాలకు హాని జరగకుండా వుండే విధంగా కమీషనరు ఆదేశాలు జారీ చేయవచ్చు. గిరిజన సంక్షేమ కమీషనరు జారీ చేసిన ఉత్తర్వులు విభేదించు వ్యక్తి / సంస్థ, అవి వెలువడిన 90 రోజుల్లోగా ప్రభుత్వాన్ని పునర్విచారణ జరపమని కోరవచ్చును. కమీషనర్ ఉత్తర్వులను సమీక్షించి గిరిజనుల ప్రయోజనాలకు హానీ కలుగకుండా తగు ఉత్తర్వులు జారీచేసే అధికారం ప్రభుత్వానికి వుంటుంది.

## గ్రామ పంచాయితీ, మండల ప్రజా పరిషత్తు అధికారాలు/బాధ్యతలు:

### చిన్న తరహా ఖనిజాలు :

చిన్న తరహా ఖనిజాల అన్వేషణ కోసం లైసెన్సు, గనుల తవ్వకం, కౌలు మంజూరుకు లేదా వేలం ద్వారా చిన్న తరహా ఖనిజాల తవ్వకాల విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం గ్రామ పంచాయతీకే వుంటుంది. రాయితీలు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తులు లేదా స్థానిక షెడ్యూల్డు తెగల సంఘాలకు మాత్రమే రాయితీలు, లైసెన్సులు పొందే అర్హత వుంటుంది. గ్రామ పంచాయితీ నిర్ణయమే గనులశాఖ పాటించాలి.

### గ్రామ సంతల నిర్వహణ :

గ్రామ సంతల నిర్వహణ, గిరిజనులకు లైసెన్సు మంజూరు విషయంలో గ్రామ పంచాయతీయే మార్కెట్ కమిటీగా వ్యవహరిస్తుంది. మార్కెట్ యార్డుల నిర్వహణలో భాగంగా అమ్మకపు ఒప్పందాలు, అమలు లేదా రద్దు, తూకాలు, చెల్లింపులు వంటి ఇతర అంశాల క్రమబద్దీకరణ బాధ్యత గ్రామ పంచాయతీకి వుంటుంది.

### మహిళా, శిశు సంక్షేమం :

గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్ వాడి వర్కర్లు అంటే హెల్పర్లు, వర్కర్ల నియామకం మరియు వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి గ్రామ పంచాయతీకి అధికారం వుంటుంది.

### చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ :

చిన్న తరహా నీటి వనరులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ గ్రామాల ప్రజల ప్రయోజనాలకు సంబంధించినవి అయితే చిన్న తరహా నీటి వనరులు ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీపై వుంటుంది. రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామ పంచాయతీలు చిన్న తరహా నీటి వనరుల ప్రణాళిక విషయంలో నిర్వహణ బాధ్యత ఆయా మండల ప్రజా పరిషత్తుకు వుంటుంది. రెండు లేదా అంతకంటే, ఎక్కువ మండలాల పరిధిలో చిన్నతరహా నీటి వనరులు ఉన్నట్లయితే చిన్న తరహా నీటి వనరుల

ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత సంబంధిత జిల్లా పరిషత్తుకు వుంటుంది. మరమ్మత్తులు, పునరుద్ధరణ చర్యలు సీజన్ల వారీగా ఆయకట్టు నిర్ణయం, నీటి రేటును విధించడం, వాటి వసూళ్ళు, వినియోగం వంటి చర్యలు చిన్నతరహా నీటి వనరుల "నిర్వహణ"లో భాగంగా వుంటాయి.

## గిరిజన ఉప ప్రణాళిక అమలు :

గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోగా గిరిజన ఉప ప్రణాళిక భౌతిక, ఆర్థిక కేటాయింపుల వివరాలను మండల పరిషత్తు అభివృద్ధి అధికారి తెలియచేయాలి. నెలకు ఒకసారి మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ వారీగా వాటి పరిధిలో జరుగు గిరిజన ఉప ప్రణాళిక అభివృద్ధి అమలును సమీక్షించాలి. గిరిజన ఉప ప్రణాళిక అమలుపై పరిపాలన / నివేదికలను సంబంధిత జిల్లా కలెక్టరు గారి ద్వారా మండల పరిషత్తు, గ్రామ పంచాయతీలు ప్రభుత్వానికి సమర్పించాలి.

## ఆరోగ్యం :

గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పంచాయతీరాజ్ సంస్థలే, అంటే గ్రామస్థాయిలో గ్రామ పంచాయితీ, మండలంలో మండల ప్రజా పరిషత్తు, మరియు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులు వాటి పరిధిలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును స్వయంగా నిర్వహిస్తాయి. ఆరోగ్య పథకాలు అమలు, మందుల సరఫరా, వాడకం మరియు వ్యాధి నిరోధక చర్యలపై సమీక్ష, పర్యవేక్షణ బాధ్యత వుంటుంది. పంచాయతీరాజ్ సంస్థలు గ్రామాలలో రక్షిత నీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్యం వంటి కార్యక్రమాల యాజమాన్య బాధ్యత తీసుకుంటాయి. మండల పరిషత్తు పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరియు సబ్ సెంటర్ల బడ్జెట్‌ను ఆమోదించాలి. ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోపు తన పరిధిలోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల మరియు సబ్ సెంటర్ల పరిపాలన నివేదికలను మండల పరిషత్తు కోరాలి.

## షెడ్యూల్డు ప్రాంతాలలో భూసేకరణ :

భూ సేకరణ, నష్టపరిహారం, నిర్వాసిత వ్యక్తుల పునరావాస ప్రణాళికల

ప్రతిపాదనపై సంబంధిత అధికారులతో విచారించి, చర్చించిన అనంతరం తగు సిఫార్సులు చేసే అధికారం మండల ప్రజా పరిషత్తు కలిగి వుంటుంది. సూచించిన చర్యలను అధికారులు తీసుకోవడం లేదని మండల ప్రజా పరిషత్తు భావించినట్లయితే వ్రాత పూర్వకంగా ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరచవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆ విషయంపై సముచిత చర్య తీసుకోవాల్సి వుంటుంది.

## సామాజిక రంగాలలోని పనిచేయు సంస్థలు, సిబ్బందిపై నియంత్రణ :

### విద్య :

మండల పరిషత్తు పరిధిలో గల అన్ని విద్యా సంస్థల బడ్జెట్‌ను మే 31వ తేదీ నాటికి అంటే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆమోదించాలి. విద్యా సంస్థలలోని హాజరు మరియు ఉపాధ్యాయుల విధుల పర్యవేక్షణ, అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై క్రమశిక్షణ చర్యల కోసం సంబంధిత క్రమశిక్షణా అధికారికి మండల పరిషత్తు నివేదించాలి. ఆయా సంబంధిత గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్తుకు తెలియపరుస్తూ సంబంధిత శిక్షణాధికారి చర్య తీసుకోవాలి.

### సంక్షేమం వసతి గృహాల నిర్వహణ :

మండల పరిషత్తు తన పరిధిలోని వసతి గృహాలలో విద్యార్థులకుఆహార సరఫరా, మరమ్మత్తులు మరియు ఇతర దైనందిన కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించాలి. వసతి గృహాల పరిపాలన నివేదికనుకోరడం, విద్యార్థులను చేర్చుకొను విషయంలో సిఫార్సులు, విధులకు గైర్హాజరు మరియు సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బందిపై తగు క్రమశిక్షణ చర్యలకు సిఫార్సులు చేసే అధికారం వుంటుంది.

### మహిళా శిశు సంక్షేమం :

ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోగా తమ పరిధిలోగల ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు అధికారి నుండి పరిపాలన నివేదికలను మండల పరిషత్తు కోరాలి.

# 8. ఎస్.సి. మరియు ఎస్.టి. ఉప ప్రణాళిక చట్టం

రాష్ట్ర జనాభాలో ఎస్.సి మరియు ఎస్.టిల జనాభా నిష్పత్తి ఆధారంగా రాష్ట్ర వార్షిక మొత్తం బడ్జెట్లో నిధులు కేటాయింపు చేయడం ద్వారా వారి అభివృద్ధిని, ముఖ్యంగా ఆర్థిక, సామాజిక మరియు మానవ అభివృద్ధి రంగాలలో వేగవంతం చేసేందుకు, అలాగే వారి భద్రత, సామాజిక గౌరవం సాధించేందుకు వీలుగా ఈ చట్టం ఉద్దేశించబడినది.

ఎస్.సి మరియు ఎస్.టి ఉప ప్రణాళిక చట్టం 2013లో ప్రభుత్వం తీసుకువచ్చింది. చట్టం అమలు సజావుగా సాగేందుకు వీలుగా 2015లో ఉప ప్రణాళిక నియమాలు ప్రకటించింది. ఈ చట్టం అమలు విషయంలో ప్రభుత్వం ఎటువంటి తదుపరి నిర్ణయం తీసుకోకపోతే ఒక దశాబ్ద కాలం పాటు ఈ చట్టం అమలులో వుంటుంది.

**మీకు తెలుసా?**

**చట్టం ఏర్పాటుకు ప్రధాన కారణం, షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక విషయంలో మాదిరిగానే షెడ్యూల్డు తెగలకు చెందిన ఉప ప్రణాళికకు సంబంధించిన నిధులు కూడా పలు సందర్భాలలో దారి మళ్ళాయని ఉప ప్రణాళికకు చట్టబద్ధతను కల్పించారు. గిరిజనులకు జనాభాలో దామాషా ప్రాతిపదికలో నిధులు కేటాయించి ఖర్చు చేయడం ఇక తప్పనిసరి అవుతుంది.**

అలా కేటాయించిన నిధులతో ఎస్.సి మరియు ఎస్.టిలకు నేరుగా లబ్ధి పొందే విధంగా ఉప ప్రణాళికలు అమలు చేయాల్సి వుంటుంది. ఎస్.సి మరియు ఎస్.టి మరియు ఇతర వర్గ ప్రజల మధ్య గల అభివృద్ధి అంతరాలు గుర్తించి అభివృద్ధిలో సమానంగా ప్రోత్సహించే విధంగా ఎస్.సి మరియు ఎస్.టిల అభివృద్ధి పథకాలు అమలు చేయాలి.

ఆరోగ్యం, విద్య, ప్రాంత అభివృద్ధి, జనాభా స్త్రీ పురుష నిష్పత్తి, జనాభా పెరుగుదల శిశు మరణాల రేటు తదితర అంశాల ప్రాతిపదికన అభివృద్ధి

అంతరాలను గుర్తిస్తారు. వాటి ఆధారంగా వివిధ వర్గ ప్రజల మధ్య గల అభివృద్ధిలో అంతరాలను పూడ్చే విధంగా ప్రణాళికలు రచించాల్సి వుంటుంది.

ప్రభుత్వ శాఖలు రూపొందించిన ఉప ప్రణాళిక పథకాలు మరియు నిధుల కేటాయింపులు సంబంధిత నోడల్ ఏజన్సీ అనుమతి కోసం పంపాలి. నోడల్ ఏజన్సీ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన ఏర్పాటు కాబడుతుంది. వివిధ శాఖల ప్రణాళికలు పరిశీలించిన తర్వాత గిరిజన ఉప ప్రణాళిక పథకాలపై ఒక నివేదిక నోడల్ డిపార్టుమెంటు (గిరిజన సంక్షేమ శాఖ) తయారు చేసి నోడల్ ఏజెన్సీకి పంపుతుంది.

నోడల్ ఏజెన్సీలో వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులు సభ్యులుగా వుంటారు. నోడల్ ఏజెన్సీ కన్వీనర్‌గా గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వుంటారు. ఎస్.సిలకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులతో నోడల్ ఏజెన్సీ ఏర్పడుతుంది.

నూరు శాతం ఎస్.సి మరియు ఎస్.టిల అభివృద్ధికి సంబంధించిన పథకాలు మాత్రమే ఖర్చు ఉప ప్రణాళికలో చూపించాలి. ప్రభుత్వం చేపట్టే సాధారణ పథకాల అమలు లబ్ధి ఎలాగో ఎస్.సి మరియు ఎస్.టిలకు లభిస్తుంది.

విభజించడానికి వీలులేని పథకాలలో మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 7 శాతం ఎస్.సి.లకు మరియు 3 శాతం ఎస్.టిలకు కేటాయిస్తారు. గ్రామాల్లో ఒక వేళ నూరుశాతం ఎస్.సి మరియు ఎస్.టిల జనాభా లేకపోతే వారి జనాభా నిష్పత్తి ఆధారంగా ఉప ప్రణాళికలో కేటాయింపులు వుండాలి.

ఉప ప్రణాళిక నియమాలకు లోబడి రూపొందించిన పథకాలను నోడల్ ఏజెన్సీ (గిరిజన సంక్షేమ శాఖ) సిఫార్సుల మేరకు రాష్ట్ర ఎస్.సి మరియు ఎస్.టి అభివృద్ధి మండలికి పంపుతారు. రాష్ట్ర ఎస్.సి మరియు ఎస్.టి అభివృద్ధి మండలి ఆమోదించిన బడ్జెట్‌ను ఆయా శాఖల పద్దుల్లో చేర్చుతారు.

రాష్ట్ర ఎస్.సి మరియు ఎస్.టి అభివృద్ధి మండలి రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పడి, వివిధ శాఖల మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వం నియమించిన ఇతరులు సభ్యులుగా ఉంటారు. మండలికి కన్వీనర్‌గా ప్రణాళిక శాఖ ప్రధాన కార్యదర్శి వుంటారు. ఉప ప్రణాళిక అమలుకు సంబందించిన విధానాలు, సలహాలు రాష్ట్ర మండలి వివిధ శాఖలకు ఇస్తుంది.

జిల్లా స్థాయిలో ఎస్.సి ఉప ప్రణాళిక అమలు కోసం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యవేక్షణ కమిటీలు వుంటాయి. ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వైస్ చైర్మన్‌గా ఉంటారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎస్.సి. ప్రణాళికకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

చట్టం లోబడి ప్రణాళిక రూప కల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించే బాధ్యత, సమన్వయపరచే బాధ్యత పర్యవేక్షణ బాధ్యత జిల్లా కమిటీకి వుంటుంది. ఉప ప్రణాళిక అమలులో పారదర్శకత పాటించాలి. సామాజిక ఆడిట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి అంతరాలు గుర్తించడం, జిల్లా, రాష్ట్ర మానవ అభివృద్ధి సూచికలతో విశ్లేషణ చేయడం, దానికి అనుగుణంగా ఉప ప్రణాళికలు రూపొందించే విషయంలో పర్యవేక్షణ బాధ్యత జిల్లా కమిటీకి వుంటుంది. సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

# 9. కుల ధృవీకరణ పత్ర జారీ చట్టం

రాష్ట్ర షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డ్ తెగల మరియు వెనుకబడిన తరగతుల కుల ధృవీకరణ చట్టం 1993లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆయా కులాల, తెగలను బట్టి ప్రత్యేక సదుపాయాలను, ప్రయోజనాలు రాజ్యాంగం కల్పించింది.

అయితే షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల మరియు వెనుకబడిన తరగతుల కులాలకు చెందని వారు ఆయా కులాలకు చెందినట్లుగా ధృవీకరణ పత్రాలు పొందడంతో అసలైన కులాల, తెగల వారు నష్టపోవలసి వస్తుంది. అందువలన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల మరియు వెనుకబడిన తరగతుల కులాల ధృవీకరణ కోసం ప్రత్యేక చట్టం ప్రభుత్వం రూపొందించింది. చట్టం అమలుకు 1997లో, ప్రభుత్వం నియమాలు రూపొందించింది.

షెడ్యూల్డ్ కులాలు, లేదా షెడ్యూల్డ్ తెగల లేదా వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తులు, దరఖాస్తు చేసుకొని ఆయా కులాలకు సంబంధించిన కుల ధృవీకరణ పత్రాలను పొందవచ్చు. కుల ధృవీకరణ పత్రాలు పొందగోరువారు ఆయా కులాలకు చెందిన వ్యక్తులుగా రుజువు చేసుకోవలసిన బాధ్యత వారిపై వుంటుంది. దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు సమర్పించాలి.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు మండల రెవిన్యూ అధికారి వద్ద నుండి కుల ధృవీకరణ పత్రం పొందవచ్చును. మైదాన ప్రాంతాలలో నివసించే గిరిజనులు ఆర్.డి.ఓ లేదా సబ్ కలెక్టర్ నుండి కుల ధృవీకరణ పత్రం పొందవచ్చును.

**ధృవీకరణ పత్రాలు?**

**స్కూల్ రికార్డ్స్, స్వస్థలం, జనన ధృవీకరణ పత్రాలు, వంశవృక్షం, గతంలో పొందిన కుల ధృవీకరణ పత్రాలు, కోర్టులు జారీ చేసిన ఉత్తర్వులు కుటుంబంలో వ్యక్తులు గతంలో పొందిన ధృవీకరణ పత్రాలు, తెగల సాంప్రదాయ, ఆచారాలకు సంబంధించిన సమాచారం, ఇతర కుల పెద్దల సాక్ష్యాలు.**

ఒకవేళ అర్జీదారులు ఎవరైనా ఆయా కులాలకు సంబంధించిన వ్యక్తులు కాని ఎడల వారి దరఖాస్తులను అధికారులు తిరస్కరించవచ్చును. ఒకవేళ మోసపూరితంగా గతంలో ఎవరైనా కుల ధృవీకరణ పత్రాలను పొందినట్లైతే జిల్లా కలెక్టర్ తనంతట తానుగా లేదా ఎవరైనా ఫిర్యాదు చేసినచో విచారణ జరిపి అటువంటి కులధృవీకరణ పత్రాలను రద్దు చేయవచ్చు. గిరిజనుల కుల ధృవీకరణ విషయం గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

**మీకు తెలుసా?**

**అధికారుల విచారణ అనంతరం మీ సేవ ద్వారా ఈ కుల ధృవీకరణ పత్రాలను పొందవచ్చు.**

గిరిజనుల కుల ధృవీకరణ విషయంలో అనుమానాలు తలెత్తినప్పుడు కుల దృవీకరణ పత్రాలు జారీ చేసే అధికారులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులకు నివేదించవచ్చును. లేదా గిరిజన సాంస్కృతిక పరిశోధనా సంస్థ, విజయవాడ నుండి తగిన సహాయం పొందవచ్చును.

ఒకవేళ జారీ కాబడిన కుల ధృవీకరణ పత్రాలపై అనుమానాలు తలెత్తినప్పుడు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా స్థాయి పరిశీలనా కమిటీకి నివేదించవచ్చును. పరిశీలనా కమిటీ సమగ్ర విచారణ జరిపి ఇచ్చిన నివేదికను తదుపరి, జిల్లా కలెక్టర్ పరిశీలించి కుల నిర్ధారణపై తగు ఉత్తర్వులు ఇవ్వవచ్చును.

కుల ధృవీరణ పత్రాల మంజూరును తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై 30 రోజులలోగా జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చు. అలాగే జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులతో విభేదించువారు 30 రోజులలోగా ప్రభుత్వం ముందు రివిజన్ పిటీషను దాఖలు చేసుకొనవచ్చును.

జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్వర్వులను ప్రభుత్వం పున:సమీక్షించి, మార్పు లేదా రద్దు లేదా పునర్విచారణకు ఆదేశించవచ్చు లేదా ఇచ్చిన ఉత్తర్వులను ఖాయపరచవచ్చును.

ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చి కులధృవీకరణ పత్రాలు పొంది నట్లయితే ఆ వ్యక్తులు కనీసం 6 నెలలు నుండి సుమారు 2 సంవత్సరములు వరకు జైలు శిక్ష మరియు రూ. 1000/-లు నుండి రూ. 5,000/-లు వరకు జరిమానాకు బాధ్యులు ప్రత్యేక కారణాలు వున్నాయని కోర్టు భావించినట్లైతే శిక్షలు లేదా జరిమానాలు తగ్గించవచ్చు. తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొంది ఆయా కులాలకు కేటాయించిన విద్యా సంస్థలలో సీట్లు, మరియు ఉద్యోగాలు పొందినట్లయితే వారు వాటి నుండి తొలగించబడుదురు.

అప్పటికే ప్రభుత్వం నుండి సొమ్ము పొందిన లేదా ఇతరత్రా ఆర్థిక లబ్ధిని పొందిన, తిరిగి ఆయా వ్యక్తుల నుండి వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. తప్పుడు కుల ధృవీకరణ పత్రాల ద్వారా విద్యాసంస్థలలో చేరి డిగ్రీలు లేదా ఇతర విద్యార్హతలు పొందినట్లయితే వారికి ఇచ్చిన కుల ధృవీకరణ పత్రాలు రద్దు అయిన వెంటనే ఆ విద్యా అర్హతలు డిగ్రీలు కూడా రద్దు కాబడతాయి.

అటువంటి వ్యక్తులు 6 నెలల నుండి రెండు సంవత్సరముల వరకు జైలు శిక్ష మరియు రూ. 1000/-లు నుండి రూ. 5,000/-లు వరకు జరిమానాకు బాధ్యులు. అలాగే తప్పుడు కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఎన్నిక కాబడినటువంటి వ్యక్తులు కూడా అటువంటి శిక్షలకు బాధ్యులు. గిరిజనులు కాని వ్యక్తులు తప్పుడు కుల ధృవీకరణ పత్రాల ద్వారా గిరిజన హక్కుల రక్షణ

కోసం చేసిన నిబంధనలను లేదా ఉత్తర్వుల ద్వారా లబ్ది పొందినట్లయితే పైన పేర్కొన్న శిక్షలకు బాధ్యులు.

ప్రభుత్వ ఉద్యోగులు తప్పుడు కుల ధృవీకరణ పత్రాలను ఉద్దేశపూర్వకంగా జారీ చేసినట్లైతే ఆ అధికారులు కూడా పైన పేర్కొన్న శిక్షలకు బాధ్యులు. అటువంటి నేరాలకు పాల్పడిన వ్యక్తులపై ముందుగా ప్రభుత్వ అనుమతిపై క్రిమినల్ కేసు దాఖలు చేయవచ్చును.

### మీకు తెలుసా?

- ❖ రాజ్యాంగపరంగా రాష్ట్రపతి ప్రకటించిన ఎస్.టి జాబితాకు భిన్నంగా ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవి చెల్లవు.
- ❖ రాష్ట్రపతి ప్రకటించిన ఎస్.టి. జాబితాలో పేర్లను మార్పు కోరుతూ లేదా రద్దు చేసేందుకు వేసే ఎటువంటి కేసులు కోర్టులు విచారించవు.
- ❖ గిరిజన కుల ధృవీకరణ పత్రాన్ని రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఉన్నది.
- ❖ ఒకసారి కుల ధృవీకరణ పత్రం జారీ కాబడితే రద్దు అయ్యేంతవరకు అది అమలులో వుంటుంది.
- ❖ గిరిజనుని వివాహం చేసుకున్నంత మాత్రాన గిరిజనేతరుల కులం మారదు.
- ❖ గిరిజన మరియు గిరిజనేతరులకు పుట్టిన పిల్లలు ఏ ఆచార సాంప్రదాయం ప్రకారం పెరిగారు? సంబంధిత గిరిజన సమాజం వారిని గిరిజనులుగా గుర్తించడానికి సమ్మతిస్తున్నదా అనే విషయంపై ఆధారపడి వుంటుందని రాష్ట్ర హైకోర్టు డివిజినల్ బెంచి **1997**లో స్పష్టం చేసింది.
- ❖ ఒక రాష్ట్రంలో ప్రకటించబడిన గిరిజన తెగల ప్రకటన మరొక రాష్ట్రానికి వర్తించదు.

# 10. షెడ్యూల్డు ప్రాంత ఋణ (వడ్డీ) వ్యాపార నిబంధనలు 1960

గిరిజనుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని, వడ్డీ వ్యాపారస్తులు చేస్తున్న మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వము ఈ నిబంధనలను రూపొందించింది. ఏజెన్సీ ప్రాంతాలలో నాము, సిరినాము (నాము అంటే బస్తాకు రెండు బస్తాలు, సిరినాము అంటే బస్తాకు బస్తాన్నర) పేరుతో పంటలపై అప్పులు, బంగారు అభరణాలు, వస్తువులు తదితర తాకట్టు వ్యాపారం పై వడ్డీకి అప్పులు ఇచ్చి గిరిజనులను మోసగించే విధానం నిషేధించబడింది.

ఈ నిబంధనలు రాష్ట్రంలో షెడ్యూల్డు ప్రాంతాలన్నిటికీ వర్తిస్తాయి. ప్రభుత్వ అధికార్ల నుండి లైసెన్సు పొందకుండా ఋణాలు ఇస్తూ వడ్డీ వ్యాపారం చేయటాన్ని నిషేధించారు, లైసెన్సు పొందకుండా వ్యాపారం చేసే వడ్డీ వ్యాపారస్తులు (6) ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ. 1000/- లు వరకు జరిమానా లేదా రెండింటికి శిక్షార్హులు. లైసెన్సు ఇచ్చే అధికారం ఏజెన్సీ ఆర్.డి.ఒ / సబ్ కలెక్టరుకు ఉంటుంది.

హామీ పై అప్పు ఇస్తే, సంవత్సరానికి ఇచ్చిన అప్పు పై 9 శాతం, హామీ లేని అప్పు పై 12 శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదు. 25 రూపాయలు మించిన తాకట్టు అప్పు పై 6 1/4 శాతం మించి వడ్డీ వసూలు చేయరాదు.

అప్పులు ఇచ్చిన తర్వాత వసూలు చేసే సమయంలో ఋణగ్రస్తులను నిర్భందానికి గురిచేసినా, బెదిరించినా లేదా ఋణగ్రస్తుల హక్కు భుక్తములోనున్న ఆస్తులకు ఆటంకము కలిగించే చర్యలకు పాల్పడినవారు ఒక ఏడాది పాటు జైలు శిక్ష లేదా రూ. 1000/- లు జరిమానా లేదా రెండింటికి శిక్షార్హులు.

ఈ వడ్డీ వ్యాపార నిబంధనలకు విరుద్ధంగా ఋణాలు ఇచ్చినవారు వాటిని వసూలు చేసుకొనేందుకు కోర్టులో వీలుండదు. ఒకవేళ ఎవరైనా ప్రభుత్వం నుండి లైసెన్సు పొంది వడ్డీ పై ఋణాలు ఇవ్వదలచినవారు అప్పుకు సంబంధించిన వివరాలతో కూడిన రాతపూర్వక ఒప్పందం పై ఇద్దరి సాక్షుల

సంతకాలు ఉండాలి. అందులో ఒకటి సంబంధిత గ్రామ సర్పంచ్ సాక్షి సంతకమై ఉండాలి. లేకపోతే కేసు విచారణకు కోర్టులు స్వీకరించవు. లైసెన్సు పొందిన వడ్డీ వ్యాపారులు కూడా ఋణ వివరాలతో కూడిన రిజిష్టరును నిర్వహించాలి.

ఏజెన్సీ ప్రాంతంలో అనధికారంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారి పై తహాశీల్దార్ లేదా సబ్ కలెక్టరుకు ఫిర్యాదు చేయవచ్చును. షెడ్యూల్డు ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ (పెసా) చట్టం కింద గిరిజనులతో వడ్డీ వ్యాపారం చేస్తున్న సంస్థలకు లైసెన్సులు మంజూరు చేయరాదని పేర్కొనబడింది.

# 11. షెడ్యూల్డు కులాల, తెగల (అత్యాచార నిరోధక) చట్టం

షెడ్యూల్డు కులాల (ఎస్.సి), షెడ్యూల్డు తెగల (ఎస్.టి) వారికి సామాజిక ఆర్థిక రంగాలలో సమాన అవకాశాలను పొందేందుకు, వారికి సామాజిక న్యాయము అందించేందుకు, మరియు అగ్ర వర్ణాల అత్యాచారాల నుండి రక్షించేందుకు ఈ చట్టం రూపొందించబడింది. ఎస్.సి, ఎస్.టిలకు చెందని వారు, వీరి న్యాయపరమైన హక్కులకు భంగం కలిగించడం, అసత్యపు నేరారోపణల ద్వారా కేసులలో ఇరికించడం వంటివి ఈ చట్టము క్రింద నేరాలుగా పరిగణించబడతాయి. అటువంటి నేరాలకు పాల్పడినవారిపై విచారణ జరిపించేందుకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుతో పాటు బాధితులకు పునరావాసం కూడా కల్పించేందుకు ఈ చట్టాన్ని 1990లో అమలులోకి తెచ్చారు. ఎస్.సి, ఎస్.టిలకు చెందిన వారిని అంటరానివారుగా పరిగణించినా, అవమానించాలనే ఉద్దేశ్యంతో కులం పేరుతో దూషించితే ఈచట్టం కింద శిక్షార్హులు. ఈ చట్టాన్ని పలుమార్లు సవరిస్తూ 2017లో మరోమారు సవరించారు.

**మీకు తెలుసా**

**షెడ్యూల్డు కులాలు, తెగలపై అత్యాచార (నిరోధక) చట్టం - 1989 అమల్లోనికి వచ్చి 25 సంవత్సరాల తదుపరి మార్చి 4, 2014న ఈ చట్టాన్ని సవరిస్తూ కొత్తగా ఆర్డినేన్స్ అమల్లోనికి తెచ్చారు. దీనివలన పాత చట్టంలోని లొసుగులు, లోపాలు సరిచేసి, మరింత పటిష్ఠంగా అమలు అయ్యేందుకు వీలయ్యింది. కొత్త నిర్వచనాలను చేర్చడం, కొత్త అర్థాలను ఇవ్వడం వంటి సవరణల వలన చట్టం మరింత బలపడింది.**

## ఏఏ చర్యలు అత్యాచారాలుగా పరిగణించబడతాయి ?

1. తినకూడని పదార్థములు తినమని లేదా తాగమని ఎస్.సి., లేదా ఎస్.టి.,లను బలవంత పెట్టడం (సెక్షన్ 3 (1) (ఏ) )

2. చెత్త, దుర్వాసన కలిగించే చెడు పదార్థాలు మొదలైన వాటిని ఎస్.సి., లేదా ఎస్.టి.,ల నివసించే ప్రదేశాల ఆవరణల ముందు వేయటం (సెక్షన్ 3 (1) (బి))

3. బాధ, అవమానం కలిగించే ఉద్దేశ్యంతో చెత్త, దుర్వాసన కలిగించే చెడు పదార్థాలు మొదలైన వాటిని ఎస్.సి., లేదా ఎస్.టి.,ల ఇంటి పొరుగున వేయడం (సెక్షన్ 3(1) (సి))

4. చెప్పుల దండ వేయడం, నగ్నంగా లేదా అర్ధనగ్నంగా ప్రదర్శించడం (సెక్షన్ 3 (1) (డి))

5. బలవంతంగా బట్టలు విప్పడం, గుండు చేయించడం, మీసాలు తీసి వేయడం, ముఖమునకు రంగులు పులమడం, వంటి మానవ గౌరవాన్ని దెబ్బతీసే వంటి చర్యలకు పాల్పడడం (సెక్షన్ 3 (1) (ఇ)).

6. ఎస్.సి., లేదా ఎస్.టి.,ల భూములను అన్యాయంగా ఆక్రమించడం, సాగు చేయడం లేదా బలవంతంగా బదలాయించడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (ఎఫ్)).

7. వారి స్థలాల ఆవరణలు లేదా భూముల నుండి “అక్రమంగా” తొలగించడం లేదా వారికి చెందిన భూమి లేదా అటవీ భూములు లేదా నీటి వనరులపై గల హక్కులలో జోక్యం చేసుకోవడం, పంటలు నాశనం చేయడం, లేదా ఉత్పత్తులను తీసుకొని వెళ్ళిపోవడం వంటి చర్యలు, అక్రమంగా అంటే వారి ఇష్టాలకు భిన్నంగా / సమ్మతి లేకుండా / భయపెట్టడం లేదా హాని కలిగించే చర్యలు వలన సమ్మతి పొందినా / భూమి రికార్డ్స్ తారుమారు చేయడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (జి))

8. ప్రజా ప్రయోజనాలకు ప్రభుత్వం నిర్ధేశించిన తప్పని సరి సేవలు మినహా వారిని భిక్షాటనకు లేదా వెట్టిచాకిరి వంటి చర్యలకు బలవంతం చేయడం వంటి చర్యలు (సెక్షన& 3 (1) (హెచ్))

9. మానవ శవాలను లేదా జంతు కళేబరాలను బలవంతంగా మోయించడం లేదా శవాలను పాతిపెట్టడానికి గోతులు తవ్వించడం వంటి బలవంతపు చర్యలు (సెక్షన్ 3 (1) (ఐ))

10. పారిశుధ్యం పనులు చేయించడం, నియమించడం లేదా అటువంటి పనులు చేయడానికి అనుమతించడం (సెక్షన్ 3 (1) (జె))



11. ఎస్.సి., లేదా ఎస్.టి.,ల స్త్రీలను దేవస్థానాలకు ఇతర మతపర సంస్థలకు అంకితం చేయడం, దేవదాసి వంటి దురాచారాలను ప్రోత్సహించడం, అనుమతించడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (కె))

12. బలవంతం చేయడం లేదా బెదిరించడం వంటి చర్యలు ద్వారా ఓటు వేయకుండా అడ్డుపడటం లేదా సూచించిన వ్యక్తికే ఓటు వేయమని చెప్పటం లేదా చట్ట వ్యతిరేక పద్ధతుల్లో ఓటు వేయమని చెప్పటం లేదా నామినేషన్ వేయకుండా చేయడం లేదా ఉపసంహరించేలా చేయడం లేదా అభ్యర్థిని బలపరచకుండా వుండేటువంటి చర్యలు (సెక్షన్ 3 (1) (ఎల్)).

13. పంచాయతీ రాజ్ సంస్థలు సభ్యులుగా లేదా అధ్యక్షులుగా ఉన్న ఎస్.సి., లేదా ఎస్.టి.,లను వారి సాధారణ విధులను మరియు బాధ్యతలను

నిర్వర్తించకుండా చేసేందుకు బెదిరించడం లేదా అడ్డుపడటం వంటి చర్యలు (సెక్షన్ 3(1) (ఎం)).

14. సాంఘిక లేదా ఆర్థిక బహిష్కరణకు గురిచేస్తామని బెదిరించడం, ఎన్నికలు తర్వాత హింసకు పాల్పడటం, లేదా ప్రభుత్వం నుండి పొందగలిగే లబ్ధిని పొందకుండా నిరోధించడం (సెక్షన్ 3 (1) (ఎన్))

15. సూచించిన అభ్యర్థికి కాకుండా వేరే వ్యక్తికి ఎస్.సి., లేదా ఎస్.టి.లు ఓటు వేసినందుకు, లేదా చట్టప్రకారం ఓటు వేసినందుకు వారికి వ్యతిరేకంగా ఈ చట్టం పేర్కొన్న నేర చర్యలకు పాల్పడటం (సెక్షన్ 3 (1) (ఓ))

16. ఎస్.సి., లేదా ఎస్.టి.లపై అవమానకర లేదా తప్పుడు కేసులు పెట్టడం (సెక్షన్ 3 (1) (పి))

17. ప్రభుత్వ అధికారులకు తప్పుడు సమాచారమిచ్చిన కారణంగా ఆ ప్రభుత్వ ఉద్యోగి తీసుకొన్న చర్యల వలన ఎస్.సి., లేదా ఎస్.టి.లకు బాధ లేదా నష్టం కలిగించడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (క్యూ)).

18. ప్రజలు చూస్తుండగా ఏ ప్రదేశంలోనైనా ఉద్దేశ్యపూర్వకంగా ఎస్.సి., లేదా ఎస్.టి.లను అవమానించడం లేదా కించపరచడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (ఆర్)).

19. ప్రజలు చూస్తుండగా ఏ ప్రదేశంలోనైనా ఎస్.సి., లేదా ఎస్.టి.లను కులం పేరుతో దూషించే చర్యలు (సెక్షన్ 3 (1) (ఎస్).

20. ఎస్.సి., లేదా ఎస్.టి.లు పవిత్రంగా భావించే వాటిని (ఫోటో / విగ్రహాలు మొదలుగు) నష్టపరచడం లేదా నాశనం చేసేచర్యలు (సెక్షన్ 3 (1) (టి)).

21. ఎస్.సి., లేదా ఎస్.టి.లకు వ్యతిరేక భావాన్ని శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, మాట్లాడడం, వ్రాయడం లేదా చిహ్నాల రూపంలో చూపడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (యు))



22. ఉన్నత స్థానాన్ని అధిరోహించి గతించిన ఎస్.సి., లేదా ఎస్.టి.ల పట్ల అగౌరవంగా మాట్లాడటం, వ్రాయడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (వి))

23. ఎస్.సి., లేదా ఎస్.టి. స్త్రీలని తెలిసి వారి సమ్మతి లేకుండా ఉద్దేశపూర్వకంగా లైంగిక చర్యలలో భాగంగా తాకడం, మాట్లాడటం, లైంగిక స్వభావపు హావభావాలు వంటి చర్యలు (సెక్షన్ 3 (1) డబ్ల్యు)

24. ఎస్.సి., లేదా ఎస్.టి.ల వినియోగించుకుంటున్న సెలయేర్లు, రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల వినియోగాన్ని తగ్గించడం లేదా కలుషితం చేయడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (ఎక్స్))

25. ప్రభుత్వ స్థలాలకు వెళ్ళడానికి ఉన్న సంప్రదాయదారుల వినియోగాన్ని నిరాకరించడం లేదా ఆటంకపర్చడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (వై)).

26. ఎస్.సి., లేదా ఎస్.టి.ల ఇళ్ళ నుండి, గ్రామాల నుండి నివాస స్థలం నుండి వదిలి వెళ్ళమని బలవంతం చేయడం. అయితే ప్రభుత్వ విధులలో భాగంగా తీసుకొనే చర్యలు నేరం కాదు (సెక్షన్ 3 (1) (జెడ్)).

27. ఉమ్మడి వనరులు, చెరువులు, స్మశాన వాటికలు, నదులు, సెలయేర్లు, నూతులు, స్నాన ఘట్టాలు, దారులు, ప్రజాసౌకర్యాలు మున్నగు వాటి విషయంలో ఎస్.సి., లేదా ఎస్.టి.ల వినియోగాన్ని ఆటంకపరచడం లేదా నిరోధించడం వంటి చర్యలు (సెక్షన్ 3 (1) (జెడ్.ఎ (ఏ))

28. సైకిల్, గుర్రం స్వారీ, కొత్త దుస్తులు, చెప్పులు వేసుకోవడం లేదా వివాహ ఊరేగింపులు తీయడం వంటి ఎస్.సి., లేదా ఎస్.టి.ల చర్యలను ఆటంకపరచడం లేదా నిరోధించడం వంటి చర్యలు (సెక్షన్ 3(1) (జెడ్.ఎ (బి))

29. ప్రజలందరికి ఉద్దేశించిన దేవాలయాల ప్రవేశం లేదా మతం, సామాజిక సాంస్కృతిక ఊరేగింపులు, జాతర్లలో సహా పాల్గొనడం, ఆటంకపరచడం లేదా నిరోధించడం వంటి చర్యలు (సెక్షన్ 3(1) (జెడ్.ఎ (సి))

30. ప్రజల సదుపాయం కోసం ఏర్పాటైన ఆసుపత్రులు, విద్యాలయాలు, దుకాణాలు, వినోద స్థలాలు, ఇతరత్రా ప్రజా అవసరాల వినియోగం విషయంలో ఎస్.సి., లేదా ఎస్.టి.ల చర్యలను ఆటంకపరచడం లేదా నిరోధించడం వంటి చర్యలు (సెక్షన్ 3(1) (జెడ్.ఎ (డి)).

31. ఇతర వ్యక్తుల వలే చేపట్టిన వృత్తి, వ్యాపారం, ఉద్యోగం విషయంలో వున్న హక్కులు వినియోగంలో ఆటంకపర్చడం (సెక్షన్ 3(1) (జెడ్.ఎ (ఇ))

32. చేతబడి చేస్తున్నారనే నెపంతో శారీరకంగా లేదా మానసికంగా వేధించడం (సెక్షన్ 3(1) (జెడ్.బి))

33. సామాజిక లేదా ఆర్థిక బహిష్కరణకు బెదిరించడం. (సెక్షన్ 3(1) (జెడ్.సి)).

### మీకు తెలుసా?

**గుండు చేయడం, మీసాలను తీసి వేయడం వంటి చర్యలను కొన్ని అత్యాచారాలను కొత్తగా రూపొందించిన సవరణ చట్టం 2015లో చేర్చారు.**

## కేసుల విచారణ మరియు శిక్షలు :

పైన పేర్కొన్న అత్యాచారాలకు పాల్పడినట్లు రుజువైతే కనీసం 6 నెలల నుండి 5 ఏండ్ల వరకు జైలు శిక్ష ఇంకా జరిమానా కూడా కోర్టు విధించవచ్చును. వారి ఆస్తులకు నష్టం కలిగించిన నేరస్థులకు ఆరు నెలలు నుండి ఏడు సంవత్సరముల వరకు శిక్ష విధించవచ్చు. కేసులను జిల్లాలో గల ప్రత్యేక కోర్టులు విచారణ చేస్తాయి.

**మీకు తెలుసా?**

**గిరిజనుల సాగు చేసుకుంటున్న అటవీ భూమి నుండి వారిని తొలగించడం లేదా వారి అటవీ భూమి హక్కుల్లో జోక్యం చేసుకోవడం, కూడా అత్యాచారమే అని కొత్తగా రూపొందించిన సవరణ చట్టం 2015 తెలియజేస్తుంది.**

## మరిన్ని కఠిన శిక్షలు :

1. జీవితఖైది, మరణశిక్ష విధించదగిన కేసులలో ఎస్.సి., లేదా ఎస్.టి.లకు వ్యతిరేకంగా తప్పుడు సాక్ష్యం చెప్పి లేదా అక్రమంగా సాక్ష్యాలు సృష్టించి వారిని శిక్షలకు గురి చేసినట్లయితే అటువంటి తప్పుడు సాక్షికి ఈ చట్ట ప్రకారం మరణశిక్ష విధించబడుతుంది. (సెక్షన్ 3 (2) (i))

2. ఏడేళ్ళు లేదా అంతకుమించి శిక్ష పడే కేసుల్లో షెడ్యూల్డు తెగల వారిపై అబద్ధపు సాక్ష్యం చెప్పి లేదా సృష్టించి తద్వారా వారిని శిక్షలకు గురి చేసిన వ్యక్తులకు ఈ చట్ట ప్రకారం కనీసం ఆరు నెలల నుండి 7 ఏండ్ల వరకు లేదా అంతకు పై బడి జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు. (సెక్షన్ 3 (2) (i))

3. షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూల్డు తెగల ఆస్తులకు నష్టం కలుగజేసే విధంగా ప్రేలుడు పదార్థాలను ఉపయోగించి ధ్వంసం చేసినవారికి ఈ చట్టం కింద కనీసం 6 నెలల నుండి 7 ఏండ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. (సెక్షన్ 3 (2) (iii))

4. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డు తెగల వారిపై భారత శిక్షాస్మృతిలో పేర్కొనబడిన 10 సంవత్సరములకు తగ్గకుండా శిక్ష విధించే అవకాశం గల నేరాలకు పాల్పడిన లేదా షెడ్యూల్డు కులముల లేదా షెడ్యూల్డు తెగలనే కారణంగా వారి ఆస్తుల విధ్వంసానికి సంబంధించిన నేరాలకు పాల్పడినట్లయితే జీవిత ఖైదు మరియు జరిమానా కూడా విధించవచ్చు. (సెక్షన్ 3 (2) (iv))

5. వీరి ఇళ్లను, ప్రార్థనా మందిరాలను తగులబెట్టడం, ప్రేలుడు పదార్థాలను ఉపయోగించి విధ్వంసానికి గురి చేయ్యాలనే లక్ష్యంతో పలు చర్యలకు పాల్పడినవారు జీవిత ఖైదుకు, జరిమానాకు శిక్షార్హులు (సెక్షన్ 3 (2) (v))

6. వీరు షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూల్డు తెగల వారని తెలిసి వారికి వ్యతిరేకంగా లేదా వారి ఆస్తులకు సంబంధించిన నేరాలకు పాల్పడినప్పుడు విధించే ఐ.పి.సి శిక్షలకు బాధ్యులు (VA))

7. ఉద్దేశ్యపూర్వకంగా షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూల్డు తెగల వారిపై జరిగిన అత్యాచారాలకు సంబంధించిన సాక్ష్యాలను మాయం చేసి తద్వారా చట్టపరమైన శిక్ష నుండి ముద్దాయిని తప్పించినా లేదా అందజేసిన సమాచారం వాస్తవం కాదని తెలిసి కూడా అట్టి సమాచారం అందజేసిన వారు అసలు నేరానికి, విధించే శిక్షకు బాధ్యులవుతారు. (సెక్షన్ 3 (2) vi))

8. ప్రభుత్వ ఉద్యోగులు ఈ నేరానికి పాల్పడినట్లయితే కనీసం ఒక ఏడాది జైలు శిక్ష నుండి జరిగిన నేరానికి విధించే శిక్షాకాల పరిమితికి శిక్షార్హులు (సెక్షన్ 3 (2) (vii))

9. షెడ్యూల్డు కులము లేదా షెడ్యూల్డు తెగల వారు మినహా ఇతర ప్రభుత్వ అధికారులు, షెడ్యూల్డు కులముల లేదా షెడ్యూల్డు తెగల వారిపై పాల్పడిన అత్యాచారాలకు సంబంధించిన సంఘటనలపై చట్టం కింద తీసుకోవల్సిన

చర్యలను తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యానికి పాల్పడితే వారు కనీసం 9 నెలల నుండి ఒక ఏడాది పాటు జైలు శిక్షకు బాధ్యులు (సెక్షన్ 4)

10. ఒకసారి అత్యాచారానికి పాల్పడి శిక్ష అనుభవిస్తున్నవారు మరొకసారి అత్యాచారానికి పాల్పడినట్లయితే కనీసం ఒక ఏడాది జైలు శిక్ష నుండి జరిగిన నేరానికి నిర్ధేశించబడిన శిక్షకు అర్హులు (సెక్షన్ 5)

ఈ చట్టం కింద శిక్ష పడిన ముద్దాయి స్థిర, చరాస్థులను ప్రభుత్వపరం చేయమని లేదా కేసు విచారణ స్థాయిలో నిందితుని స్థిర లేక చరాస్థులు జప్తు చేయమని కోర్టు ఆదేశించవచ్చు. కేసులను జిల్లాలో గల ప్రత్యేక కోర్టులు విచారణచేస్తాయి.

షెడ్యూల్డు ప్రాంతాలలో ఏ వ్యక్తి అయినా అత్యాచారాలకు పాల్పడే ప్రమాదం వుందని ఫిర్యాదు వున్నా లేదా పోలీసులు నివేదిక సమర్పించినా అటువంటి వ్యక్తిని ఆ ప్రాంతాల నుండి తొలగిపొమ్మని కోర్టు ఆదేశించవచ్చు. ఏ దారి నుండి వెళ్ళాలో ప్రస్తావించవచ్చు. ఆదేశాలు పాటించని వ్యక్తిని అరెస్టు చేసి సూచించిన ప్రాంతములో వదిలి పెట్టమని కోర్టు ఉత్తర్వులు ఇవ్వవచ్చు. ఏ వ్యక్తి అయినా కోర్టు ఉత్తర్వులను అతిక్రమిస్తే ఒక ఏడాది పాటు జైలుశిక్షకు జరిమానాకు బాధ్యుడు, ప్రత్యేక న్యాయస్థానం తీర్పులపై హైకోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చు.

జిల్లా మెజిస్ట్రేటు లేదా సబ్ డివిజినల్ లేదా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు లేదా డి.ఎస్.పి. స్థాయికి తగ్గని ఏ పోలీస్ అధికారైనా ఈ చట్టం కింద షెడ్యూల్డు కులము లేదా షెడ్యూల్డు తెగల వారిపై ఎవరైనా అత్యాచారాలు జరిపే ప్రమాదం వుందని భావించినప్పుడు ముందుగానే వాటి నిరోధానికి చర్యలు తీసుకొనే అధికారం వుంది. నిందితులకు ముందస్తు బెయిల్ సౌకర్యం లేదు. అత్యాచారానికి గురైన బాధితులకు విచారణ సమయంలో న్యాయ సహాయం మరియు తగిన ఆర్థిక సదుపాయం ప్రభుత్వం కల్పించాలి.

ఈ చట్టం కింద పేర్కొన్న నియమాల ప్రకారం డి.ఎస్.పి. స్థాయికి తగ్గని అధికారులే అత్యాచార కేసులు దర్యాప్తు చేపట్టి, విచారణ తర్వాత చార్జీషీటు దాఖలు చేయవలసి వుంటుంది. డి.ఎస్.పి. స్థాయి దిగువ సిబ్బంది అంటే సి.ఐ. లేదా ఎస్.ఐ.లు దర్యాప్తు చేస్తే అటువంటి కేసులు ఈ చట్టం కింద వీగిపోతాయని రాష్ట్ర హైకోర్టు పలుమార్లు స్పష్టం చేసింది.

**మీకు తెలుసా?**

**షెడ్యూల్డ్ కులాల / షెడ్యూల్డ్ తెగల అణచివేతను అరికట్టటానికి రూపొందించిన చట్టాలను ఈ కులాలు / తెగలు దుర్వినియోగం చేస్తూ, ప్రతీకారేచ్ఛతోనే, అసౌకర్యం కలుగజేయాలనో, రాజీ రూపంలో ధనం సమకూర్చుకోవాలనో అమాయకులైన పౌరుని పై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా దుర్వినియోగం కారాదని న్యాయస్థానాలు సైతం అభిప్రాయపడినవి. ఇలా చేస్తే వారు తగిన శిక్ష అనుభవించాల్సి వుంటుంది.**

## బాధితుల మరియు సాక్ష్యుల హక్కులు :

అత్యాచారానికి గురైన వారి రక్షణకు, సంఘటనకు సంబంధించిన సాక్షులకు ప్రభుత్వము అన్ని విధాల రక్షణ కల్పించాలి. అత్యాచారానికి గురైన వ్యక్తులకు ముందస్తు సమాచారము లేకుండా ముద్దాయి దాఖలు చేసుకునే దరఖాస్తులపై కోర్టు విచారణలో నిర్ణయాలు తీసుకోరాదు. బాధితులకు పునరావాసం కల్పించే బాధ్యత, అంటే ఆర్థిక సహకారం, విద్య, ఆహారం, నివాసం తదితర పోషణ నిమిత్తం ఏర్పాట్లు, కేసుకు సంబంధించిన వివరాలు, ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు బాధితులకు లేదా వారిపై ఆధారపడే వ్యక్తులకు తెలియజేయాలి. సంస్థల లేదా న్యాయవాదుల సహకారం పొందే హక్కు బాధితులకు వుంటుంది. తన తరపున కేసు వాదించడానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించమని ప్రభుత్వాన్ని కోరవచ్చు.

# అనుబంధం-1

## 1. ఆంధ్రప్రదేశ్ ఎస్.టిల జాబితా

1. అంధ్, సాధు అంధ్
2. బగత
3. భిల్
4. చెంచు
5. గదబ, బొడో గదబ, గుటబ్ గదబ, కల్లాయి గదబ, పరంగి గదబ, కత్తెర గదబ, కాపు గదబ
6. గోండు, నాయకపోడు, రాజ్‌గోండు, కొయిటురు
7. గౌడు
8. హిల్ రెడ్డి
9. జతాపూస్
10. కమ్మర
11. కట్టు నాయకన్
12. కొలం
13. కొండ దొరలు, కుబి
14. కొండ కాపులు
15. కొండ రెడ్లు
16. కోందులు, కోడి, కోదు, దేశాయ కొందులు, డోంగ్రియ కోందులు, కుట్టియ కోందులు, టికిరియా కోందులు, యెనిటి కోందులు, కువింగ
17. కొటియా, బెంతో ఒరియ, బార్తిక దులియా, హోల్వ, సన్రోన, సిద్దోపైకో

18. కోయ, డోలికోయ, గుట్ట కోయ, కమ్మర కోయ, ముసర కోయ, ఒడ్డి కోయ, పట్టిడి కోయ, రాజాహ, రాషకోయ, లింగదారి కోయ (సాధారణ) కొట్టు కోయ, బిన్నె కోయ, రాజకోయ

19. కులియ

20. మాలిస్

21. మన్నెదొర

22. ముఖదొర, నూకదొర

23. నాయక్స్

24. పర్ధాన్

25. పోర్ట, పరంజిపోర్ట

26. రెడ్డి దొర

27. రోన, రేన

28. సవరలు, కాపు సవరలు, మాలియ సవరలు, కుట్టో సవరలు

29. సుగలీలు, లంబాడీలు, బంజర

30. వాల్మీకి

31. యానాది, చెల్ల యానాది, కప్పల యానాది, మంచియానాది, రెడ్డియానాది

32. ఎరుకులలు, కొరచ, దబ్బ ఎరుకల

33. నక్కల, కుర్వీకరన్

34. దులియా

**(గిరిజన సంక్షేమ శాఖ ప్రచురణ - 2011 సెన్సస్ ఆధారంగా)**

# అనుబంధం-2

## 1. ఐక్యరాజ్య సమితి ఆదివాసీ హక్కుల ప్రకటన

**అధికరణ 1 : మానవ హక్కులు :** అంతర్జాతీయ న్యాయ సూత్రాల క్రింద పేర్కొనబడిన మానవ హక్కులు మరియు స్వేచ్ఛను ఆదివాసీ ప్రజలు వ్యక్తులుగా, సమూహాలుగా పొందే హక్కు ఉంటుంది.

**అధికరణ 2 : సమానత్వం :** ఆదివాసీలు ఎటువంటి వివక్ష లేకుండా ఇతర ప్రజానీకంలా సమానంగా వుండే హక్కు

**అధికరణ 3 : స్వీయ నిర్ణయం :** ఆదివాసీలకు స్వీయ నిర్ణయ హక్కు ఉంది. వారు కోరుకొంటున్న విధంగా అభివృద్ధి మరియు రాజకీయ స్థాయిని కోరుకోవచ్చు.

**అధికరణ 4 : స్వయం ప్రతిపత్తి :** స్వీయ నిర్ణయంలో భాగంగా వారి వ్యవహారాలు విషయంలో స్వయం ప్రతిపత్తి లేదా స్వయం పాలనా హక్కు ఉంది.

**అధికరణ 5 : విభిన్న సంస్థలు :** భిన్న సంస్థలు ఏర్పాటు మరియు అభివృద్ధి పరచుకొనే హక్కు వారు కోరుకుంటే ఇతర పౌర జీవనంలో భాగం పంచుకొనే హక్కు.

**అధికరణ 6 : జాతీయత :** దేశ పౌరునిగా ఉండే హక్కు ప్రతీ ఆదివాసీకి వుంది.

**అధికరణ 7 : ఉనికి :** భద్రత, శాంతి మరియు స్వేచ్ఛతో జీవించే హక్కు పిల్లలను బలవంతంగా వేరుచేయడం ఇతరత్రా హింస మరియు జీవవిచ్ఛిత్తి నుండి స్వేఛ్ఛాహక్కు.

**అధికరణ 8 : సాంస్కృతిక సమగ్రత :** ఇతరులతో మమేకం కావాలనే ఒత్తిడి నుండి స్వేఛ్ఛాహక్కు ప్రభుత్వం ఈ క్రింది వాటిని నిరోధించాలి. ఎ) భిన్న సంస్కృతి మరియు ఉనికిని నాశనం చేసే చర్యలు. బి) భూమి మరియు వనరుల పరాయీకరణ చర్య. సి) భూమి నుండి తొలగించే చర్యలు. డి) ఒత్తిడితో మమేకం కావించే రూపాలు, ఇ) వ్యతిరేక ప్రచార చర్యలు.

**అధికరణ 9 : ప్రజలు మరియు జాతీయత :** వారి ఆచార సంప్రదాయాల ప్రకారం ఆయా ఆదివాసీ తెగలు, మరియు ఆయా జాతీయ దేశానికి చెందే హక్కు.

**అధికరణ 31 : సంస్కృతి / మేథో సంపద :** ఆదివాసీల సంప్రదాయ విజ్ఞానం, సాంస్కృతిక వారసత్వం, శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానంతో పాటు విత్తనాలు, మందులు, వృక్ష జంతు సంపద విజ్ఞాన మరియు మౌఖిక సంప్రదాయం, నమూనాలు మరియు నిర్వహణల అభివృద్ధి మరియు నియంత్రణాధికారం ఆదివాసీలకు ఉంది. ఇటువంటి ఆదివాసీ హక్కులను గుర్తించి రక్షణ కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి.

**అధికరణ 32 : వనరుల అభివృద్ధి :** భూమి మరియు వనరులు అభివృద్ధి చేసుకొనేందుకు తగు వ్యూహాలు నిర్దేశించుకునే హక్కు ఆదివాసీలకు వుంది. ఆదివాసీల భూమి, వనరులు ముఖ్యంగా ఖనిజాలు, జలాలు మరియు ఇతర వనరుల అభివృద్ధికి హాని కలిగించే కార్యక్రమాలు నిర్వహించే ముందు ప్రభుత్వం ఆదివాసీల నుండి అనుమతి పొందేందుకు సంప్రదింపులు జరపాలి. కార్యక్రమాల వల్ల కలిగే వ్యతిరేక ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలతో పాటు న్యాయబద్ధమైన నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి.

**అధికరణ 33 : ఆదివాసీ పౌరసత్వం :** తమ సభ్యులు ఎవరో ఆదివాసీలు నిర్ధారించుకునే హక్కు ఆదివాసీలకు వుంది. వారి సంఘాల నిర్మాణ విషయంలో నిర్ణయించుకునే హక్కు ఉంది.

**అధికరణ 34 : ఆదివాసీ చట్టాలు మరియు సంప్రదాయాలు :** అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు అనుగుణంగా ఆదివాసీలు వారి సొంత న్యాయ వ్యవస్థ మరియు సంప్రదాయాలు కలిగి వుండే హక్కు.

**అధికరణ 35 : బాధ్యతలు :** ఆదివాసీ ప్రజల పట్ల ఆదివాసీ వ్యక్తుల బాధ్యతలను నిర్ణయించే హక్కు ఆదివాసీ ప్రజలకు ఉంది.

**అధికరణ 36 : సరిహద్దులు :** అంతర్జాతీయ సరిహద్దులు వేరుచేసే ఆదివాసీ ప్రాంత ప్రజలు ఒకరితో మరొకరు సత్సంబంధాలు కొనసాగించుకోవడంతో పాటు కార్యక్రమాలు నిర్వహించుకొనే హక్కు.

**అధికరణ 37 : ఒడంబడికలు :** ఆదివాసీలతో ఏర్పర్చుకున్న ఒడంబడికలు మరియు అంగీకారాలను ప్రభుత్వం గౌరవించాలి.

**అధికరణ 38 :** ఆదివాసీలతో సంప్రదింపులు జరిపి ఐక్యరాజ్యసమితి ఆదివాసీల హక్కుల ప్రకటన అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**అధికరణ 39 : ప్రభుత్వం మరియు అంతర్జాతీయ సాయం :** ఐక్యరాజ్యసమితి ఆదివాసీల హక్కుల ప్రకటనలో హక్కులు అనుభవించేందుకు ప్రభుత్వాలు మరియు అంతర్జాతీయ సంఘాల నుండి ఆర్థిక సాయం తీసుకొనే హక్కు ఆదివాసీలకు ఉంది.

**అధికరణ 40 : వివాదాలు :** ప్రభుత్వం మరియు ఇతర భాగస్థుల వల్ల తలెత్తే వివాదాలు పరిష్కారం పొందే విషయంలో మరియు హక్కుల ఉల్లంఘన పరిహార విషయంలో న్యాయమైన విచారణ పద్ధతిని కోరుకొనే హక్కు. ఆదివాసీల ఆచార, సంప్రదాయాలను, విచారణ పద్ధతులు పరిగణలోకి తీసుకోవాలి.

**అధికరణ 41 : ఐక్యరాజ్య సమితి సాయం :** ఐక్యరాజ్య సమితి ప్రకటన కింద పేర్కొనబడిన ఆదివాసీల సమగ్ర హక్కుల అమలుకు ఐక్యరాజ్య సమితి మరియు ఇతర అంతర్జాతీయ సంఘాలు ఆర్థిక, ఇతరత్రా సాయాన్ని ఆదివాసీలకు అందించాలి.

**అధికరణ 42 : ప్రత్యేక ఐక్యరాజ్య సమితి సంస్థలు :** ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలతో పాటు ఆదివాసీ సమస్యల విషయంలో ఏర్పర్చిన శాశ్వత వేదిక, ఐక్యరాజ్య సమితి ప్రకటనలో పేర్కొనబడిన హక్కులు గౌరవించేలా చర్యలు తీసుకోవాలి.

**అధికరణ 43 : కనీస ప్రమాణాలు :** ప్రకటనలో కనీస ప్రమాణాలు సూచించే ఆదివాసీల హక్కులు మాత్రమే పేర్కొనబడ్డాయి.

**అధికరణ 44 : పురుషులు / స్త్రీలు :** ప్రకటనలో పేర్కొనబడిన హక్కులు పురుషులు మరియు స్త్రీలకు సమానంగా వర్తిస్తాయి.

**అధికరణ 45 : ఇతర ఆదివాసీ హక్కులు :** ప్రస్తుతం అమలులో వున్న ఆదివాసీల ఇతర హక్కులు లేదా భవిష్యత్తులో గుర్తించే హక్కులకు ప్రకటనలో పేర్కొనబడిన ఆదివాసీ హక్కులు ఎటువంటి ఆటంకం కల్గించవు.

**అధికరణ 46 : ఐక్యరాజ్య సమితి హక్కుల పత్రం :** స్వతంత్ర దేశ సమగ్రతకు హాని కల్గించే చర్యలు లేదా ఐక్యరాజ్య సమితి తీర్మానాల వ్యతిరేక చర్యలకు ఆదివాసీ హక్కుల ప్రకటన అనుమతించదు.